'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 49 | శనివారం | 3.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 49 | Saturday | 3.10.2026 | Pages: 8 | Rate: 2


2లో..

కొడంగల్‌లో సభ పెడతాం

రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం

ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. కొడంగల్ సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తామని వ్యాఖ్యానించారు. సిద్దిపేటలో రేవంత్‌రెడ్డి సభ పూర్తయిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తెలిపారు. ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సీఎం సభ నిర్వహించడాన్ని తలసాని



సీఈసీ రాజీనామా చేయాల్సిందే

కంచే చేను మేసినట్టుగా జ్ఞానేశ్ తీరు

కోదండరామ్ మౌన పోరాటం

సర్ ప్రక్రియను నిలిపివేయాలని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జన సమితి గాంధీ జయంతి సందర్భంగా నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మౌన దీక్ష చేపట్టింది. టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ దా. అద్దంకి దయాకర్‌తో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సర్‌లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)



ధర్మం-దేశం ఒక్కటే భగవత్

ఒకదానికొకటి పరస్పర ఆధారం

ప్రపంచానికి భారత జ్ఞానమే దిక్సూచి

భారతీయ దృక్పథంలో దేశం, ధర్మం వేర్వేరు కాదని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ అన్నారు. ముంబైలో జరిగిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి ధర్మం ఆధారమని, ధర్మం దేశాన్ని నిలబెడుతుందని పేర్కొన్నారు. ప్రపంచం ప్రస్తుతం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి పరస్పర విరుద్ధ పరిస్థితులతో సతమతమవుతోందని చెప్పారు. ఒక సమస్యను పరిష్కరించేందుకు మరో అంశాన్ని పూర్తిగా త్యజించే విధానం కాకుండా సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందన్నారు. (వివరాలు 2లో..)



నెలల ఉత్కంఠకు తెర

పంజాబ్ కాంగ్రెస్‌కు కొత్త సారథి

వారింగ్‌కు గుడ్‌బై.. పర్గత్‌కు పగ్గాలు

పంజాబ్ కాంగ్రెస్‌లో నెలలుగా రగులుతున్న నాయకత్వ సంక్షోభానికి ఏఐసీసీ తెరదించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అమరీందర్ సింగ్ రాజా వారింగ్ రాజీనామా చేయగా.. ఆయన స్థానంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్‌ను కొత్త పీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. వర్గపోరు, అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న పంజాబ్ కాంగ్రెస్‌ను గాడిలో పెట్టేందుకు కేంద్ర నాయకత్వం కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకొచ్చింది. (వివరాలు 3లో..)


2లో..

ప్రాణాలు కాపాడిన పైలట్‌కు మోదీ ప్రశంసలు

స్మిత్ మచ్చార్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని

ఫ్లై దుబాయ్ విమానంలో జరిగిన తీవ్ర ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఘటన సమయంలో ఎదురైన పరిస్థితులను మచ్చార్ ప్రధానితో పంచుకున్నారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న విమానంలో కోపైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. కాక్‌పిట్ తలుపులు తెరవడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడి చేసిన కోపైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలోని 174 మంది సురక్షితంగా బయటపడ్డారు.



44 ఏళ్ల నిరీక్షణకు తెర

చైనాపై హాకీ గోల్డ్ గెలుచుకున్న భారత్

భారత మహిళల హాకీ జట్టు అద్భుత పోరాటంతో చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడలు-2026 మహిళల హాకీ ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను 1-0తో ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. 44 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మహిళల హాకీలో భారత్‌కు బంగారు పతకం దక్కింది. అంతేకాదు, ఈ విజయంతో 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు భారత్ అర్హత సాధించింది. మ్యాచ్ ప్రారంభానికి ముందే రోడ్డు ప్రమాదం కారణంగా గంట ఆలస్యమైనా భారత ఆటగాళ్ల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. 10వ నిమిషంలో సాక్షి రాణా అందించిన బంతిని లాల్‌రెమ్సియామి అద్భుతమైన రివర్స్ షాట్‌తో గోల్‌గా మలిచి భారత్‌కు ఆధిక్యం అందించింది. ఆ తర్వాత అసలు పరీక్ష మొదలైంది. చైనా పదేపదే దాడులు చేస్తూ ఒత్తిడి పెంచినా సవిత నాయకత్వంలోని భారత రక్షణ గోడ కదల్లేదు. ఐదు పెనాల్టీ కార్నర్లు, ఓ పెనాల్టీ స్ట్రోక్ లభించినా చైనా గోల్ చేయలేకపోయింది. 23వ నిమిషంలో వచ్చిన పెనాల్టీ స్ట్రోక్‌ను సవిత ఎడమవైపు డైవ్ చేస్తూ అడ్డుకోవడం మ్యాచ్ మలుపుగా మారింది. చివరి వరకు భారత డిఫెన్స్ ప్రతి బంతినీ అడ్డుకుని ఆధిక్యాన్ని కాపాడింది. యువశక్తి, అనుభవం కలిసిన భారత జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు స్వర్ణ అధ్యాయంతో ముగింపు పలికింది.



ప్యాసెంజర్స్ పాలిట ప్రాణదాత ఆ పైలట్..

- యావత్ దేశం చేస్తోంది సెల్యూట్..
- ప్రాణాలను పణంగా పెట్టిన ధీరుడు..
- ఉన్నత పౌర సత్కారానికి అర్హుడు

7లో..

ఆకాశంలో 34 వేల అడుగుల ఎత్తు.. కిందికి దూసుకెళ్తున్న విమానం.. కాక్‌పిట్‌లో రక్తపు మరకలు.. ప్రయాణికులకు ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి. ఇజ్రాయెల్ వైపు దూసుకెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానంలో ఒక్కసారిగా ఊహించని ఘర్షణ మొదలైంది. భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కోపైలట్ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి నేలపై పడిపోయిన స్మిత్‌కు తన ప్రాణం కాపాడుకోవడమే ముందున్న మార్గంలా కనిపించాలి. కానీ ఆయన చూపు మాత్రం కాక్‌పిట్ బయట ఉన్న వందల మంది ప్రయాణికుల వైపే ఉంది. విమానం వేగంగా కిందికి పడిపోతున్న విషయం గుర్తించిన క్షణంలో.. గాయాలతోనే చివరి శక్తిని కూడగట్టుకున్నాడు. "నేను ఏదైనా చేయాలి.. లేదంటే ప్రయాణికులు చనిపోతారు" అన్న ఒక్క ఆలోచన ఆయనను మళ్లీ లేపింది. ఆ తర్వాత ఆయన చేసిన ఒక్క పని.. విమానంలోని ప్రతి ఒక్కరి భవిష్యత్తును మార్చేసింది. ఆ తలుపు ఎందుకు తెరవాల్సి వచ్చింది? గాయాలతో ఉన్న స్మిత్ ఎలా పోరాడాడు? ఆ క్షణంలో ఆయనకు ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది? ప్రపంచం మొత్తం ఆయనను ఎందుకు హీరోగా గుర్తించింది? ఒక పైలట్ కథ కాదు.. వందల ప్రాణాల కోసం జరిగిన అసాధారణ పోరాటం ఇది.



హైదరాబాద్ ప్రయాణానికి కొత్త పాస్

- ఒకే కార్డుతో మెట్రో-ఆర్టీసీ సేవలు
- రోజువారీ ప్రయాణికులకు సౌకర్యం

హైదరాబాద్ ప్రజా రవాణాలో కీలక మార్పు వచ్చింది. మెట్రో రైలు, తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు కామన్ పాస్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించింది. ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పాస్‌ను ప్రారంభించారు. ఇక బస్సు నుంచి మెట్రోకు, మెట్రో నుంచి బస్సుకు మారే ప్రయాణికులు ప్రతి దశలో ప్రత్యేక టికెట్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో ఈ పాస్ ద్వారా రెండు రవాణా సేవలను వినియోగించుకోవచ్చు. (వివరాలు 2లో..)


2లో..

దేశంలో ₹ 49 వేల కోట్ల పెండింగ్ చలాన్లు

హైదరాబాద్‌లో 75 శాతం

గంగా ఎక్స్‌ప్రెస్‌వే తొలి దశ నిర్మాణానికి మించి

పేరుకుపోతున్న ట్రాఫిక్ జరిమానాల బకాయిలు


3లో..

జంతర్ మంతర్ వద్ద పోలీసుల నిర్బంధం

నిరసనకు అడ్డుకట్ట.. వందలాది మంది అరెస్ట్


3లో..

బెంగాల్ ఓటర్లకు కొత్త చిక్కు

సర్ తర్వాత కొత్త పంచాయితీ

22 లక్షల కేసులపై విచారణ ఎలా?


5లో..

పుతిన్..

పుట్టె ముంచుతాడా!?

- యూరప్‌ను రఫ్ఫాడిస్తామని రష్యా వార్నింగ్..
- అణు హెచ్చరికలతో పశ్చిమ దేశాలు షేకింగ్..
- అంచనాలకు అందని వ్యూహం.. పెనుముప్పు తప్పదని సందేహం

యూరప్ గుండెల్లో యుద్ధ మేఘాలు.. క్యాలినిన్‌గ్రాడ్ చుట్టూ పెరుగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు ప్రపంచ భద్రతను ప్రశ్నిస్తున్నాయి. రష్యా ప్రధాన భూభాగానికి దూరంగా, పోలాండ్, లిథువేనియా మధ్య చిక్కుకున్న ఈ చిన్న రష్యా ప్రాంతం.. పుతిన్‌కు ఎందుకంత కీలకం? ఒకప్పుడు జర్మనీకి చెందిన ఈ భూభాగం ఇప్పుడు రష్యా వ్యూహంలో కీలక సైనిక కేంద్రంగా ఎలా మారింది? ఉక్రెయిన్ యుద్ధం నాలుగో ఏడాదిలోకి అడుగుపెట్టిన వేళ క్యాలినిన్‌గ్రాడ్ మార్గాలపై ఒత్తిడి పెరిగితే మాస్కో ఎలా స్పందిస్తుంది? హెచ్చరికలతో ఆగుతుందా.. సైనిక చర్యకు దిగుతుందా.. లేక అణ్వాయుధాల ప్రస్తావన మరింత తీవ్ర రూపం దాలుస్తుందా? అసలు పుతిన్ దూకుడు వెనుక ఉన్న వ్యూహమేంటి? నాటోను భయపెట్టడమే లక్ష్యమా.. లేక రష్యా భద్రతకు ఏర్పడుతున్న ముప్పును ఎదుర్కొనే ప్రయత్నమా? మరోవైపు అమెరికా భద్రతా పాత్రపై యూరప్‌లో పెరుగుతున్న సందేహాలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఒక చిన్న భూభాగం.. రెండు అణ్వాయుధ శక్తులు.. మధ్యలో మండుతున్న యుద్ధం.. పెరుగుతున్న అనుమానాలు! క్యాలినిన్‌గ్రాడ్ ఇప్పుడు రష్యా బలమా? యూరప్ బలహీన బిందువా? సమాధానం తెలుసుకోవాలంటే పూర్తి కథనం లోపలి పేజీలో..



రేవంత్-కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

లెక్కలు తేల్చాలన్న ఎంపీ రఘునందన్ రావు

తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల అంశం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇద్దరూ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా తెలంగాణ హైకోర్టుకు లేఖ రాయాలని సవాల్ చేశారు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈ అంశం రాజకీయ చర్చకు వచ్చింది. ఆస్తులపై పారదర్శకంగా విచారణ జరిగితే ఆరోపణలకు స్పష్టత వస్తుందని రఘునందన్‌రావు పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



నేనే ఎమ్మెల్యే.. అలాగే ప్రకటించండి

ఖైరతాబాద్‌పై పీజేఆర్ డాటర్ కొత్త లెక్క

2023 ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ గెలుపును కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి సవాల్ చేశారు. ఈ మేరకు 2024లో హైకోర్టును ఆశ్రయించి, దానం నాగేందర్ ఎన్నికను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఇదే అంశంపై విజయారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని కోర్టు తేల్చితే.. ఖైరతాబాద్‌కు ప్రత్యేకంగా ఉపఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేకుండానే నన్నే ఎమ్మెల్యేగా ప్రకటించే అవకాశం ఉంది" అని ఆమె అన్నారు. (వివరాలు 2లో..)



హైదరాబాద్ ప్రయాణానికి కొత్త పాస్

- ఒకే కార్డుతో మెట్రో ఆర్టీసీ సేవలు
- రోజువారీ ప్రయాణికులకు సౌకర్యం

రోజుకు రూ.400.. నెలకు రూ.8,500

కామన్ పాస్‌లో రెండు రకాల ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. రోజువారీ పాస్ ధర రూ.400 కాగా, నెలవారీ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించారు. నెలవారీ పాస్ 30 క్యాలెండర్ రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. ఓఆర్ఆర్ పరిధి మినహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో ఈ పాస్ ఉపయోగించుకోవచ్చు. అయితే విమానాశ్రయానికి నడిచే పుష్పక్ సర్వీసుకు మాత్రం వర్తించదు. పాస్ కొనుగోలు సమయంలో రూ.100 డిపాజిట్ చెల్లించాలి. కార్డు తిరిగి ఇచ్చినప్పుడు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు.

మెట్రో స్టేషన్లలో పాస్ విక్రయం

ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైలు స్టేషన్లలో కామన్ పాస్‌లు అందుబాటులో ఉంటాయి. ఆన్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ విధానం పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రయాణికుల స్పందన ఆధారంగా అవసరమైన మార్పులు చేస్తామని చెప్పారు. నగరంలో ప్రతిరోజూ సుమారు 30 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో, 5 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారని అధికారులు తెలిపారు.

మీటికెట్‌తో డిజిటల్ టికెట్

ప్రయాణికుల కోసం మీటికెట్ యాప్‌ను కూడా ప్రారంభించారు. ఇక ఆర్టీసీ బస్సు టికెట్లను మొబైల్ నుంచే కొనుగోలు చేయవచ్చు. యాప్‌లో ఎక్కే ప్రదేశం, గమ్యస్థానం, టికెట్ రకం ఎంపిక చేసి డిజిటల్ చెల్లింపు చేయాలి. చెల్లింపు పూర్తయిన తర్వాత డైనమిక్ QR కోడ్‌తో డిజిటల్ టికెట్ వస్తుంది. బస్సులో తనిఖీ సమయంలో దాన్ని చూపించాలి. ప్రజా రవాణా వినియోగం పెంచడం ద్వారా ట్రాఫిక్, కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రేవంత్-కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

ముగ్గురం కలిసి లేఖ ఇద్దామంటూ పిలుపు



రేవంత్‌రెడ్డి, కేటీఆర్ స్పందించకపోతే తానే హైకోర్టుకు లేఖ రాస్తానని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. అవసరమైతే రేవంత్, కేటీఆర్‌తో కలిసి ముగ్గురం సిట్టింగ్ జడ్జిని కోరుదామని అన్నారు. తన ఆస్తులపైనా విచారణ జరిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారంలో ఉన్నవారు, ప్రతిపక్ష నేతలు పరస్పరం ఆస్తులపై ఆరోపణలు చేసుకోవడం కంటే న్యాయ విచారణకు సిద్ధపడాలని సూచించారు. ఇప్పటికే రేవంత్‌రెడ్డి, కేటీఆర్ మధ్య ఆస్తుల అంశంపై సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ ఎంపీ చేసిన ఈ తాజా డిమాండ్ తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

కొడంగల్‌లో సభ పెడతాం

- రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం
- ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్న తలసాని




సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం సీఎంకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఆ సభతో రేవంత్‌రెడ్డికి రాజకీయంగా నష్టమే జరిగిందని ఆయన వ్యాఖ్యానించారు.

ఖైరతాబాద్‌లో గెలుపుపై ధీమా

ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని శ్రీనివాస్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజల్లో ఆగ్రహం ఉందని, ఈసారి పోలింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు పంపిణీ చేసినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను కూడా ఆయన తప్పుబట్టారు. ఎమ్మెల్యేలు చేయని ఘటనకు, అసెంబ్లీ వెలుపల జరిగిన వివాదానికి స్పీకర్ వారిని ఎలా బాధ్యులను చేస్తారని ప్రశ్నించారు. కొడంగల్ సభ ప్రకటన, ఖైరతాబాద్ ఉపఎన్నికపై ధీమా నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది.

ధర్మం-దేశం ఒక్కటే: భగవత్

ప్రపంచానికి భారత జ్ఞానమే దిక్సూచి



భారతీయ దృక్పథంలో దేశం, ధర్మం వేర్వేరు కాదని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ అన్నారు. ముంబైలో జరిగిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి ధర్మం ఆధారమని, ధర్మం దేశాన్ని నిలబెడుతుందని పేర్కొన్నారు. ప్రపంచం ప్రస్తుతం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి పరస్పర విరుద్ధ పరిస్థితులతో సతమతమవుతోందని చెప్పారు. ఒక సమస్యను పరిష్కరించేందుకు మరో అంశాన్ని పూర్తిగా త్యజించే విధానం కాకుండా సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రపంచం భారత్ వైపు చూస్తోంది

ఈ సంక్లిష్ట పరిస్థితులకు మార్గం చూపగల సామర్థ్యం భారతీయ జ్ఞాన సంపదకు ఉందని భగవత్ అన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్, సంతుల బోధనలు భారత జ్ఞాన పరంపరలో భాగమని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని తరతరాలకు అందించే ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడటం కేవలం మతపరమైన బాధ్యతగా చూడకూడదని, అది మానవాళి భవిష్యత్తుకు చేసే సేవ అని పేర్కొన్నారు. భారతీయ సంప్రదాయం ఇతర దేశాలను జయించడం లేదా బలవంతపు మతమార్పిడిపై ఆధారపడకుండా జ్ఞానాన్ని పంచుకున్న చరిత్ర కలిగి ఉందని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలకు భారత జ్ఞాన సంపద నుంచి మార్గదర్శనం లభించగలదని భగవత్ అభిప్రాయపడ్డారు.

దేశంలో పెండింగ్ చలాన్లు ₹ 49 వేల కోట్లు

- హైదరాబాద్‌లో 75 శాతం చలాన్లు పెండింగ్
- గంగా ఎక్స్‌ప్రెస్‌వే తొలి దశ నిర్మాణానికి మించి
- పేరుకుపోతున్న ట్రాఫిక్ జరిమానాల బకాయిలు

ఒక చిన్న ట్రాఫిక్ ఉల్లంఘన.. వంద, ఐదొందలు, వెయ్యి రూపాయల జరిమానా.. చెల్లించకుండా వదిలేస్తే అది చిన్న మొత్తం కాదని దేశవ్యాప్తంగా పేరుకుపోయిన రూ.49,194 కోట్ల బకాయిలు చెబుతున్నాయి. గంగా ఎక్స్‌ప్రెస్‌వే తొలి దశ నిర్మాణ వ్యయం కంటే ఎక్కువగా ఉన్న ఈ మొత్తం ఇప్పుడు ప్రభుత్వానికి పెద్ద ప్రశ్నగా మారింది. హైదరాబాద్‌లోనే నాలుగు చలాన్లలో మూడు పెండింగ్‌లో ఉండటం పరిస్థితి తీవ్రతను చూపుతోంది. నిబంధనలు ఉల్లంఘించి జరిమానా తప్పించుకోవడం అలవాటుగా మారితే.. చివరికి ఆ భారాన్ని ఎవరు మోయాలి? సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో బకాయిదారులపై చర్యలు మొదలయ్యే వేళ.. చలాన్ అంటే తప్పించుకునే జరిమానానా? లేక బాధ్యతగా చెల్లించాల్సిన పౌర కర్తవ్యమా? అనే ప్రశ్న ప్రతి వాహనదారుడి ముందుంది.

దేశవ్యాప్తంగా వాహనదారులు చెల్లించాల్సిన పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల మొత్తం రూ.49,194.05 కోట్లకు చేరింది. ఈ మొత్తం ఎంత భారీగా ఉందంటే.. గంగా ఎక్స్‌ప్రెస్‌వే మొదటి దశ నిర్మాణానికి అంచనా వేసిన రూ.36,230 కోట్ల కంటే కూడా ఎక్కువ. దేశంలో వాహన రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్, యాజమాన్య బదిలీ, డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ వంటి సేవలపై ఈ బకాయిల ప్రభావం పడే అవకాశం ఉంది. ఇంత భారీ మొత్తాన్ని వసూలు చేయడం ట్రాఫిక్ పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

చెల్లించకపోతే సేవలపై ఆంక్షలు

పెండింగ్ ఈచలాన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. బకాయిలున్న వాహనాలను పరివాహన్ పోర్టల్‌లో బ్లాక్‌లిస్ట్ చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. బకాయిలు చెల్లించే వరకు వాహనాల విక్రయం, బదిలీకి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. పలుమార్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ నిలిపివేయడం, అవసరమైతే లైసెన్స్ సస్పెండ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని తెలిపింది. పెండింగ్ చలాన్లతో వాహనం పట్టుబడితే అవసరమైన సందర్భాల్లో వాహనాన్ని స్వాధీనం చేసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది.

కర్ణాటకలో ప్రభుత్వ వాహనాల బకాయిలు

కర్ణాటకలో ప్రభుత్వ వాహనాలపైనా భారీగా చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ



వాహనాలపై 82,208 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. వాటికి సంబంధించి రూ.19.23 కోట్లకుపైగా జరిమానాలు చెల్లించాల్సి ఉంది. పోలీస్ శాఖ వాహనాలపైనే 3,366 కేసులు నమోదయ్యాయి. నిబంధనలు అమలు చేయాల్సిన ప్రభుత్వ విభాగాల వాహనాలపైనే బకాయిలు ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్‌లో 75 శాతం చలాన్లు పెండింగ్

హైదరాబాద్‌లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. 2025 చివరి నాటికి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో నమోదైన 1.29 కోట్ల చలాన్లలో 99.22 లక్షలకు పైగా చలాన్లు చెల్లించలేదు. సైబరాబాద్‌లో 65,917 వాహనాలకు పది లేదా అంతకంటే ఎక్కువ చలాన్లు ఉన్నాయి. ద్విచక్ర వాహనాలే ఎక్కువ ఉల్లంఘనలకు కారణమవుతున్నాయి. హెల్మెట్ లేకుండా ప్రయాణం, అతివేగం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రధానంగా కనిపిస్తున్నాయి. తమిళనాడులో ప్రత్యేక ఈచలాన్ కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి బకాయిల వివరాలు, చెల్లింపు విధానాన్ని వాహనదారులకు తెలియజేస్తున్నారు.

నేనే ఎమ్మెల్యే.. అలాగే ప్రకటించండి

ఖైరతాబాద్‌పై పీజేఆర్ డాటర్ కొత్త లెక్క





2023 ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ గెలుపును కాంగ్రెస్ నేత పి. విజయారెడ్డి సవాల్ చేశారు. ఈ మేరకు 2024లో హైకోర్టును ఆశ్రయించి, దానం నాగేందర్ ఎన్నికను రద్దు చేసి తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఇదే అంశంపై విజయారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని కోర్టు తేల్చితే.. ఖైరతాబాద్‌కు ప్రత్యేకంగా ఉపఎన్నిక నిర్వహించాల్సిన అవసరం లేకుండానే నన్నే ఎమ్మెల్యేగా ప్రకటించే అవకాశం ఉంది" అని ఆమె అన్నారు. తన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంటుందన్న నమ్మకం ఉందని చెప్పారు. ఎన్నికల పిటిషన్‌పై తుది తీర్పు రాకముందే ఉపఎన్నిక నిర్వహించకూడదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఆమె ప్రస్తావించారు.

పాత పిటిషన్ తేలేవరకు ఉపఎన్నికకు బ్రేక్

పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు పడటంతో ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారింది. అయితే విజయారెడ్డి దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఆమె హైకోర్టును కోరారు. ఎన్నికల పిటిషన్ పెండింగ్‌లో ఉన్నప్పుడు అదే స్థానానికి ఉపఎన్నిక నిర్వహించడంపై సుప్రీంకోర్టు గతంలో వెల్లడించిన న్యాయ సూత్రాలను ఆమె తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా తన వైఖరిని కోర్టుకు వెల్లడించింది. ఈసీ అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబర్ 6కు వాయిదా వేసింది. దీంతో ఉపఎన్నిక కంటే ముందుగా విజయారెడ్డి ఎన్నికల పిటిషన్‌పై కోర్టు నిర్ణయం కీలకంగా మారింది.



సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- కంచే చేను మేసినట్టుగా జ్ఞానేశ్ తీరు
- కోదండరామ్ మౌన పోరాటం
- సర్‌లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.

ఈసీ పారదర్శకతపై ప్రశ్నలు

కోదండరాం మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికారంలో ఉన్నవారి సూచనలకు అనుగుణంగా వ్యవహరించే పరిస్థితి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సమావేశాలు సక్రమంగా జరగకపోవడం, సర్ ప్రక్రియలో లోపాలు కనిపించడం ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. సర్‌ను నిలిపివేసి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పారదర్శక విధానం అమలు చేయాలని కోరారు. ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వస్తే ప్రజాస్వామ్య హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు.

ఫామ్ 6పై అభ్యంతరాలు

మీడియా అకాడెమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్ 6లో అదనపు అంశాలపై స్పష్టత అవసరమని అన్నారు. యువత, మహిళలు, అర్హులైన ఓటర్లకు అనవసర అడ్డంకులు రాకూడదని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో సాంకేతిక వ్యవస్థల వినియోగం, ప్రైవేట్ సంస్థలకు అప్పగించే బాధ్యతలపై పూర్తి పారదర్శకత ఉండాలని కోరారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాజకీయ పక్షాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత, ఆదివాసీలు, దళితులు సహా అర్హులైన పౌరుల ఓట్లు తొలగించే పరిస్థితి రాకూడదని అన్నారు. ఓటు హక్కు పరిరక్షణకోసం టీజేఎన్ రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని విస్తరిస్తుందని నేతలు ప్రకటించారు.

ప్రాణాలు కాపాడిన పైలట్‌కు మోదీ ప్రశంసలు

స్మిత్ మచ్చార్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని



పై దుబాయ్ విమానంలో జరిగిన తీవ్ర ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ ధైర్యం ప్రదర్శించిన భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఘటన సమయంలో ఎదురైన పరిస్థితులను మచ్చార్ ప్రధానితో పంచుకున్నారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న విమానంలో కోపైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డారు. అయినప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. కాక్‌పిట్ తలుపులు తెరవడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి చేరుకుని దాడి చేసిన కోపైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలోని 174 మంది సురక్షితంగా బయటపడ్డారు.

కుటుంబానికి ఆరోగ్యమే ముఖ్యం

మచ్చార్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తిని మోదీ ప్రశంసిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం మెరుగైన చికిత్స కోసం ఆయనను యూఏఈకి తరలించగా, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత దౌత్య వర్గాలు తెలిపాయి. స్మిత్ తండ్రి భూపేంద్ర మచ్చార్ మాట్లాడుతూ.. ఘటన తెలిసిన వెంటనే కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైందన్నారు. దాడిలో స్మిత్ తల, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, వైద్యులు శస్త్రచికిత్స చేశారని తెలిపారు. తీవ్ర గాయాలతో కాక్‌పిట్‌లో పడిపోయినా ప్రయాణికులను కాపాడాలన్న సంకల్పంతోనే తలుపులు తెరిచారని, దాంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లి దాడి చేసిన వ్యక్తిని అడ్డుకోగలిగారని వివరించారు.

తండ్రి మాటల్లో కొడుకు సాహసం

విమానం నడపడం స్మిత్‌కు ఎంతో ఇష్టమని భూపేంద్ర చెప్పారు. ఘటన తర్వాత కుటుంబ సభ్యులు దేవుడి ముందు ప్రార్థనలు చేస్తూ ఆందోళనలో గడిపారని గుర్తుచేశారు. ప్రస్తుతం అబుదాబిలో చికిత్స పొందుతున్న స్మిత్ పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు తెలిపినట్లు చెప్పారు. "దేశం నా కుమారుడిని చూసి గర్విస్తున్నా.. bvప్రస్తుతం అతని ఆరోగ్యమే మాకు ముఖ్యం" అని భూపేంద్ర అన్నారు. ఘటనకు దారితీసిన కారణాలపై యూఏఈ, ఇజ్రాయెల్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. యువత తల్లిదండ్రులను గౌరవిస్తూ నిజాయతీగా జీవించాలని, సత్యం, ధర్మమే చివరికి గెలుస్తాయని భూపేంద్ర సూచించారు.

తల్లిపాలు తాగేవారు మనుషులు

- బిర్యానీ తినేవారు జంతువులు
- అస్సాం సీఎం వివాదాస్పద వ్యాఖ్యలు



అస్సాం ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. నాగావ్ లోక్‌సభ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా జురియాలో జరిగిన సభలో ఆయన "తల్లిపాలు తాగడానికి పుట్టినవారు మనుషులు.. బిర్యానీ తినడానికి పుట్టినవారు జంతువులు" అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ రకీబుల్ హుసేన్‌తో కొనసాగుతున్న మాటల యుద్ధంలో భాగంగానే ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని రోజుల క్రితం హుసేన్‌ను పురాణాల్లోని బకాసురుడితో పోల్చిన హిమంత, ప్రభుత్వ నిధులను మింగేస్తున్నారని ఆరోపించారు. దీనికి స్పందించిన హుసేన్, "భగవంతుడు నన్ను బిర్యానీ తినడానికే పంపాడు" అంటూ వ్యాఖ్యానించారు. ఆ మాటలను ప్రస్తావిస్తూ హిమంత తాజా వ్యాఖ్యలు చేశారు.

ఉప ఎన్నికల వేళ రాజకీయ వేడి

ఈ వివాదం సెప్టెంబర్ 28న హిమంత చేసిన బకాసురుడి వ్యాఖ్యలతో మొదలైంది. హుసేన్ కూడా హిమంత ఆహార అలవాట్లను ప్రస్తావిస్తూ ఎదురుదాడి చేశారు. నాగావ్ లోక్‌సభ స్థానానికి అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనుండగా, అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపు జరగనుంది. ప్రచారంలో హిమంత కాంగ్రెస్‌తో పాటు ఏఐయూడీఎఫ్‌పై కూడా విమర్శలు చేస్తున్నారు. రూపోహిహాట్ ఎమ్మెల్యే నూరుల్ హుదా అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఏఐయూడీఎఫ్ నేత బద్రుద్దీన్ అజ్మల్ రాజకీయాల నుంచి తప్పుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న సమయంలో హిమంత-హుసేన్ మధ్య వ్యక్తిగత వ్యాఖ్యల పరంపర రాజకీయ చర్చకు దారితీస్తోంది.



నెలల ఉత్కంఠకు తెర

- పంజాబ్ కాంగ్రెస్‌కు కొత్త సారథి
- వారింగ్‌కు గుడ్‌బై.. పర్గత్‌కు పగ్గాలు

పంజాబ్ కాంగ్రెస్‌లో నెలలుగా రగులుతున్న నాయకత్వ సంక్షోభానికి ఏఐసీసీ తెరదించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అమరీందర్ సింగ్ రాజా వారింగ్ రాజీనామా చేయగా.. ఆయన స్థానంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్గత్ సింగ్‌ను కొత్త పీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. 2027 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. వర్గపోరు, అంతర్గత విభేదాలతో సతమతమవుతున్న పంజాబ్ కాంగ్రెస్‌ను గాడిలో పెట్టేందుకు కేంద్ర నాయకత్వం కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకొచ్చింది.

రాహుల్‌కు రాజీనామా సమర్పణ

పర్గత్ సింగ్ నియామకానికి ముందు రాజా వారింగ్ రాహుల్ గాంధీని కలిసి తన రాజీనామాను అధికారికంగా సమర్పించారు. 2022 ఏప్రిల్ 22 నుంచి పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న వారింగ్.. పార్టీ ఎక్కడ బాధ్యత అప్పగించినా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. పంజాబ్‌లో పార్టీ పరిస్థితి, ఎదురవుతున్న సవాళ్లు, కాంగ్రెస్‌కు ఉన్న బలాలపై రాహుల్‌తో చర్చించినట్లు వెల్లడించారు.

వర్గపోరుకు చెక్ పెట్టే యత్నం

పంజాబ్ కాంగ్రెస్‌లో మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ, రాజా వారింగ్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొంతకాలంగా బహిరంగంగానే కనిపించింది. ఈ నేపథ్యంలో గత నెలలో పార్టీ పంజాబ్ ఇన్‌చార్జ్‌గా భూపేష్ బఘేల్ స్థానంలో సచిన్ పైలట్‌ను నియమించిన అధిష్ఠానం.. ఇప్పుడు పీసీసీ అధ్యక్షుడినీ మార్చింది. విభేదాలను తగ్గించి పార్టీ నేతలను ఒక్క తాటిపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ మార్పులను కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

పర్గత్‌పై అధిష్ఠానం ఆశలు

మాజీ మంత్రి, భారత పురుషుల హాకీ జట్టు మాజీ కెప్టెన్ అయిన పర్గత్ సింగ్‌కు వివాదరహిత నాయకుడిగా ఉన్న గుర్తింపు కలిసొచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వివిధ వర్గాలకు ఆమోదయోగ్యమైన నేతగా ఆయనను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. చన్నీ, వారింగ్ వర్గాల మధ్య అంతరాలను తగ్గించడం, పార్టీని ఎన్నికలకు సిద్ధం చేయడం కొత్త అధ్యక్షుడి ముందున్న కీలక సవాళ్లు. 2027 ఎన్నికల ముందు పర్గత్ సింగ్ నాయకత్వంలో పంజాబ్ కాంగ్రెస్ ఎలా ముందుకు సాగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఏఐ పాటలతో రష్యా ప్రచార యుద్ధం

యుద్ధానికి కొత్త డిజిటల్ ఆయుధం

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధంలో కృత్రిమ మేధ, ఏఐతో రూపొందించిన పాటలు కొత్త ప్రచార సాధనంగా మారుతున్నాయి. మధురమైన బ్యాలెట్ల నుంచి హెవీ మెటల్ వరకు విభిన్న సంగీత శైలుల్లో రూపొందుతున్న ఈ పాటలు రష్యా సైనికులను గొప్పగా చూపిస్తూ, యుద్ధాన్ని సమర్థించే కథనాలను వ్యాప్తి చేస్తున్నట్లు పరిశోధనలు వెల్లడించాయి. కొన్ని పాటల్లో ఉక్రెయిన్ ప్రజలను అవమానించే జాతి దూషణలు కూడా ఉన్నట్లు గుర్తించారు. సోవియట్ కాలం నాటి యుద్ధ గీతాల స్ఫూర్తిని ఆధునిక సంగీతంతో కలిపి కొత్త తరానికి చేరేలా వీటిని రూపొందిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

981 పాటల్లో యుద్ధ ప్రచారం

లాభాపేక్షలేని సంస్థ టెరెకాన్ పరిశోధన ప్రకారం 981 పాటలను రష్యా అనుకూల యుద్ధ ప్రచారంగా గుర్తించారు. వీటిలో అధిక భాగం 2024 తర్వాత విడుదలైనవే. సునో, ఉడియో వంటి ఏఐ మ్యూజిక్ జనరేటర్లు విస్తృతంగా అందుబాటులోకి రావడంతో ఇలాంటి కంటెంట్ తయారీ సులభమైంది. స్పాటిఫై, యాపిల్ మ్యూజిక్, యూట్యూబ్, డీజర్ వంటి ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌లలో ఈ పాటలు లక్షలసార్లు స్ట్రీమ్ అయినట్లు టెరెకాన్ నివేదిక పేర్కొంది. సునోతో రూపొందించిన ఒక పాటకు రెండేళ్లలో 20 లక్షలకు పైగా యూట్యూబ్ వీక్షణలు వచ్చినట్లు గుర్తించారు.

రష్యా ప్రభుత్వ పాత్రపై ప్రశ్నలు

ఈ పాటలను ఇంటర్నెట్‌లో విస్తరించడంలో రష్యా ప్రభుత్వం ఎంతవరకు పాత్ర పోషించిందన్నది స్పష్టంగా తెలియకపోయినా, గతంలో యుద్ధ అనుకూల సాంస్కృతిక కార్యక్రమాలకు మాస్కో మద్దతు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని నివేదికలు పేర్కొంటున్నాయి. రష్యా వార్తా కథనాల ఆధారంగా, క్రెమ్లిన్‌తో సన్నిహితంగా పనిచేసే ఇంటర్నెట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ 350కిపైగా యుద్ధ సంబంధిత కళా ప్రాజెక్టులను ప్రోత్సహించినట్లు సమాచారం.

ఏఐ నియంత్రణకు కొత్త సవాలు

స్ట్రీమింగ్ సంస్థలు భారీగా పెరుగుతున్న ఏఐ కంటెంట్‌ను పూర్తిగా నియంత్రించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. డీజర్, యూట్యూబ్ మ్యూజిక్ వంటి కొన్ని సంస్థలు ఏఐ పాటలకు లేబులింగ్ నిబంధనలు అమలు చేస్తున్నాయి. స్పాటిఫై కూడా ఏఐ పాటలను గుర్తించే విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. అయితే ప్రచార కంటెంట్‌ను ప్రత్యేకంగా నిషేధించే నిబంధనలు అన్ని ప్లాట్‌ఫారమ్‌లలో లేవు. టెరెకాన్ పరిశోధకులు సునో, ఉడియో, గూగుల్ ఫ్లో మ్యూజిక్, మురేకా వంటి సేవలను పరీక్షించగా.. మొదట కొన్ని అభ్యర్థనలను నిరాకరించినా, భావాన్ని మార్చి కోరినప్పుడు ఇలాంటి పాటలను రూపొందించగలిగారు. దీంతో పదాలను మాత్రమే గుర్తించే నియంత్రణ వ్యవస్థలు మొత్తం సందేశాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.



జంతర్ మంతర్ వద్ద
పోలీసుల నిర్బంధం

- నిరసనకు అడ్డుకట్ట.. వందలాది మంది అరెస్ట్

గాంధీ జయంతి రోజున ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ చేపట్టిన ఆందోళనకు పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ స్ట్రీట్ సబ్ డివిజన్‌లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేశారు. ఐదుగురికి మించి గుమికూడటం, నినాదాలు, ర్యాలీలు, ధర్నాలకు ఆంక్షలు విధించారు. అయితే అనుమతితో సాయంత్రం 5 గంటల వరకు జంతర్ మంతర్‌లో నిరసనకు అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

రెండు ప్రధాన మార్గాలు మూసివేత

జంతర్ మంతర్‌కు వెళ్లే రెండు ప్రధాన మార్గాలను పోలీసులు పూర్తిగా అడ్డుకున్నారు. సంసద్ మార్గ్ వైపు, కేరళ హౌస్ వైపు భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీ పోలీసులతో పాటు సీఏపీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలను మోహరించారు. సుమారు 4,000 మంది పోలీసులు విధుల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్రోన్లతో పరిస్థితిని పర్యవేక్షించారు. మెట్రో అధికారులు కూడా పటేల్ చౌక్, జనపథ్, రాజీవ్ చౌక్, మండి హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్ సహా 12 స్టేషన్లలో ప్రవేశ, నిష్క్రమణ గేట్లు మూసివేశారు.

500 మందికి పైగా అదుపులోకి

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ కార్యకర్తలు వివిధ ప్రాంతాల నుంచి జంతర్ మంతర్ వైపు ర్యాలీలు చేపట్టారు. మాజీ ఢిల్లీ సీఎం అతిశీ, యోగేంద్ర యాదవ్, AISA అధ్యక్షురాలు నేహా బోరా, AAP నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజయ్ సింగ్ సహా పలువురు నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 500 మందికి పైగా నిరసనకారులను అరెస్టు చేసినట్లు సమాచారం. మహిళా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్న దృశ్యాలు కనిపించాయి.

రేపూ ఆందోళన ..

ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలగడంతో సమీపంలోని వ్యాపారులు, గిగ్ వర్కర్లు యూపీ చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అశోకా రోడ్, జంతర్ మంతర్ రోడ్, సంసద్ మార్గ్‌లో ప్రజా రవాణాను నిలిపివేశారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్‌కు చెందిన సుమారు 500 మంది కార్యకర్తలను అడ్డుకుని, దాదాపు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 3న మధ్యాహ్నం 1 గంటకు జంతర్ మంతర్ వద్ద మళ్లీ నిరసన చేపడతామని నేహా బోరా ప్రకటించారు.



బెంగాల్ ఓటర్లకు కొత్త చిక్కు

- సర్ తర్వాత కొత్త పంచాయితీ
- 22 లక్షల కేసులపై విచారణ ఎలా?
- ట్రిబ్యునళ్లలో పెండింగ్.. ఓటుపై అనిశ్చితి!

ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలో పేర్లు కోల్పోయిన వారికి ఊరట కల్పించే ప్రయత్నమే ఇప్పుడు మరో చిక్కుకు దారితీస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో 22.21 లక్షల మంది ఓటర్ల అప్పీళ్లు ట్రిబ్యునళ్లలో పెండింగ్‌లో ఉండగా, కొత్తగా ఫామ్6 ద్వారా పేర్లను తిరిగి నమోదు చేసే ప్రక్రియ మొదలైంది. అయితే ట్రిబ్యునళ్లలో ఉన్న కేసులకు ఈ కొత్త ప్రక్రియ వర్తించదని ఈసీ స్పష్టం చేయడంతో అసలు ప్రశ్న మొదలైంది. ఒకవైపు ట్రిబ్యునల్ తీర్పు కోసం ఎదురుచూస్తున్న ఓటర్లు.. మరోవైపు వేగంగా పూర్తయ్యే ఫామ్6 ప్రక్రియ.. ఈ రెండు మార్గాల మధ్య 22 లక్షల మందికి ఓటు హక్కు ఎప్పుడు తిరిగి వస్తుందన్నది ప్రశ్నగా మారింది. ఉపఎన్నికల సమీపిస్తున్న వేళ ఈ అంశం మరింత కీలకంగా మారుతోంది.

పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) తర్వాత పేర్లు గల్లంతైన వారిని తిరిగి చేర్చేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఇప్పుడు మరో సమస్యకు దారి తీస్తోంది. అప్పీల్ ట్రిబ్యునళ్లలో కేసులు పెండింగ్‌లో ఉన్న 22.21 లక్షల మంది ఓటర్లకు ఈ కొత్త రీఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ వర్తించదని ఎన్నికల సంఘం అధికారి వెల్లడించారు. దీంతో ఒకవైపు ట్రిబ్యునళ్ల ద్వారా, మరోవైపు ఫామ్6 ద్వారా ఓటర్లను తిరిగి చేర్చే రెండు మార్గాలు ఏర్పడే అవకాశం ఉంది.

ఫామ్-6కు వేగం.. ట్రిబ్యునళ్లకు ఆలస్యం

ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం బూత్ లెవల్ అధికారులు ప్రస్తుత ఓటర్ల జాబితాను పాత జాబితాతో పోల్చి, పేర్లు కనిపించని అర్హులైన వ్యక్తులను గుర్తించాలి. ఇంటింటికీ వెళ్లి వారి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, అర్హత ఉంటే ఫామ్6 ద్వారా పేరు తిరిగి నమోదు చేయాలి. ఈ దరఖాస్తులను ఒకటి రెండు నెలల్లో పరిష్కరించాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే ఇప్పటికే ట్రిబ్యునళ్లలో విచారణలో ఉన్న కేసులు మాత్రం అదే ప్రక్రియలో కొనసాగుతాయని ఈసీ స్పష్టం చేసింది.

22.21 లక్షల అప్పీళ్లపై కీలక ప్రశ్న

ఎస్ఐఆర్ సమయంలో దాదాపు 60 లక్షల కేసులు విచారణలో ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో 19 అప్పీల్ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ వ్యవస్థ ఏర్పడింది. ఈ ట్రిబ్యునళ్లలో ప్రస్తుతం 22.21 లక్షల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఈసీ సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. మరోవైపు ఎస్ఐఆర్ సమయంలో 58,20,898 పేర్లను ASDD జాబితాలో చేర్చి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. వీరిలో 24.16 లక్షల మంది మరణించినట్లు, 32.65 లక్షల మంది గైర్హాజరు లేదా వేరే ప్రాంతానికి మారినట్లు గుర్తించారు.

ఉపఎన్నికల ముందు కాంగ్రెస్ డిమాండ్

నందిగ్రామ్, రేజినగర్ ఉపఎన్నికలకు ముందు ఈ రీఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియపై పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ రెండు నియోజకవర్గాల్లోనే 6 వేలకు పైగా, 12 వేలకు పైగా అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని పార్టీ తెలిపింది. పెండింగ్ అప్పీళ్ల కారణంగా పరుసగా రెండోసారి ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వస్తుందని పేర్కొంది. మొత్తం 22.21 లక్షల అప్పీళ్లను తుది తీర్పు వచ్చే వరకు తాత్కాలికంగా పునరుద్ధరించాలని, లేక పెండింగ్ కేసులన్నింటినీ ఫామ్6 దరఖాస్తులుగా మార్చి సంబంధిత ఎన్నికల అధికారులకు పంపాలని కాంగ్రెస్ ఈసీని కోరింది.



జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సీజేపీ నిరసన

- ముంబైలో వేలాది మందితో దీపేక్ ఆందోళన

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ముంబైలో సీజేపీ ఎన్నికల సంఘం తీరుపై భారీ నిరసన జరిగింది. ఎన్నికల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా శివాజీ పార్క్ వద్ద సుమారు 4,000 నుంచి 5,000 మంది ఆందోళనలో పాల్గొన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ అధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకు పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా, ఆందోళనకారులు శివాజీ పార్క్ గేట్ల బయట త్రివర్ణ పతాకాలతో బైఠాయించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. సీఈసీపై చర్యలు తీసుకోవాలని, సర్‌ను నిలిపివేయాలని, 2025 జనవరి ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని నిర్వాహకులు డిమాండ్ చేశారు.

మోదీపై దిప్కే సంచలన వ్యాఖ్యలు

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే మాట్లాడుతూ "జ్ఞానేశ్ కుమార్ వెళ్తే ప్రధాని నరేంద్ర మోదీ కూడా వెళ్లాల్సి వస్తుంది" అంటూ వ్యాఖ్యానించారు. సీజేపీ సహ కన్వీనర్ ఆశతోష్ రంకా కూడా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై తీవ్ర విమర్శలు చేశారు. నిరసనకారులు అరెస్టులకు భయపడవద్దని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి, పౌర సమాజ భాగస్వామ్యంతో పారదర్శకమైన కొత్త విధానం తీసుకురావాలని నిర్వాహకులు కోరారు. సర్ ద్వారా ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ప్రజల పేర్లు తొలగుతున్నాయని పలువురు ఆరోపించారు.

షబానా అజ్మీ, విశాల్ దద్లానీ హాజరు

నటుడు షబానా అజ్మీ, గాయకుడు విశాల్ దద్లానీ, హాస్యనటుడు రాజీవ్ నిగమ్ సహా పలువురు ప్రముఖులు నిరసనకు మద్దతుగా హాజరయ్యారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి కీలకమని షబానా అజ్మీ పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి వస్తే ప్రశ్నించాల్సిందేనన్నారు. ఓటర్ల జాబితా సమస్య తీవ్ర స్థాయికి చేరిందని సోమయ్య కళాశాల అధ్యాపకుడు గంగాధర్ మీనన్ అన్నారు. ఎన్సీపీ నేత అనీష్ గవాండే మాట్లాడుతూ సర్ ప్రభావం అట్టడుగు వర్గాలపై పడుతోందని ఆరోపించారు.

నిరసనలో విషాదం.. ఉద్రిక్తత

నిరసనను వీక్షించేందుకు వచ్చిన 75 ఏళ్ల గోపాలకృష్ణ సుబ్బయ్య పిళ్లై సాయంత్రం గుండెపోటుకు గురయ్యారు. ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ మరణించినట్లు డీసీపీ మహేంద్ర పండిట్ తెలిపారు. నిరసన ముగిసిన తర్వాత సీజేపీ కార్యకర్తలు, కొందరు కుడిపక్ష మద్దతుదారుల మధ్య నినాదాలపై వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో దాదర్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిరసన ప్రాంతంలో సుమారు 800 మంది పోలీసులు, అల్లర్ల నియంత్రణ బలగాలను మోహరించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.



నైక్‌కు కష్టకాలం

- తగ్గిన షూస్ మెరుపు?
- ₹ 21 లక్షల కోట్లకు పైగా ఆవిరి

ఒకప్పుడు చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరి కాళ్లపై కనిపించిన పేరు నైక్. స్కూల్ షూస్ నుంచి స్పోర్ట్స్ షూస్ వరకు, ఫ్యాషన్ నుంచి ఫిట్‌నెస్ వరకు కోట్లాది మందికి నైక్ పరిచయమైన బ్రాండ్. ప్రపంచ క్రీడా రంగంలో స్టార్ ఆటగాళ్లతో కలిసి ఓ ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న ఈ కంపెనీకి ఇప్పుడు అసలు పరీక్ష మొదలైంది. అమ్మకాలు తగ్గుతున్నాయి.. కీలక మార్కెట్లలో పోటీ పెరుగుతోంది.. కొన్ని ప్రముఖ బ్రాండ్లు వెనుకబడుతున్నాయి.. మార్కెట్ విలువలో ఏకంగా 230 బిలియన్ డాలర్లు.. అంటే రూ.21 లక్షల కోట్లకు పైగా ఆవిరయ్యాయి. మరి అందరి నోట వినిపించే నైక్‌కు ఏమైంది? ఒకప్పుడు ప్రపంచాన్ని ఊపేసిన స్నూష్ మెరుపు ఎందుకు తగ్గింది? నైక్ మళ్లీ పుంజుకుంటుందా? లేక కొత్త బ్రాండ్ల దెబ్బకు తన ఆధిపత్యాన్ని కోల్పోతుందా? ఇప్పుడు అందరి ముందున్న ప్రశ్న ఇదే.

ఒకప్పుడు స్పోర్ట్స్ ప్రపంచాన్ని శాసించిన నైక్ ఇప్పుడు భారీ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మార్కెట్ విలువలో దాదాపు 230 బిలియన్ డాలర్లు, రూపాయల్లో 21 లక్షల కోట్లకు పైగా ఆవిరి ఆవిరయ్యాయి. "జస్ట్ డూ ఇట్" అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ దిగ్గజ బ్రాండ్ ఇప్పుడు ఉద్యోగాల కోత, సంస్థాగత మార్పులు, అమ్మకాల క్షీణతతో సతమతమవుతోంది. ఆగస్టు 31తో ముగిసిన త్రైమాసికంలో నైక్ ఆదాయం 4 శాతం తగ్గి 11.2 బిలియన్ డాలర్లకు చేరింది. లాభం కూడా 2 శాతం తగ్గి 712 మిలియన్ డాలర్లకు పరిమితమైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయం సింగిల్ డిజిట్ స్థాయిలో గణనీయంగా తగ్గే అవకాశం ఉందని సంస్థ హెచ్చరించింది. ఫలితాల తర్వాత నైక్ షేరు ధర ఒక దశలో 8.5 శాతం వరకు పడిపోయింది. అయితే అసలు సమస్య షేరు పతనం కాదు. వినియోగదారులు స్పోర్ట్స్‌వేర్ కొనడం మానేయలేదు. వారికి తప్పనిసరిగా కొనాలనిపించే కొత్త ఉత్పత్తులను అందించడంలో నైక్ కొంత వెనుకబడిందన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. ఎయిర్ ఫోర్స్ 1, డంక్, ఎయిర్ జోర్డాన్, కార్టెజ్ వంటి మోడళ్లు ఒకప్పుడు ఫ్యాషన్ ట్రెండ్‌లుగా మారాయి. ఇప్పుడు మారుతున్న వినియోగదారుల అభిరుచులు, కొత్త బ్రాండ్ల పోటీ నైక్‌కు సవాలుగా నిలుస్తున్నాయి.



చైనాలో భారీ పతనం.. వ్యూహం మార్పు

నైక్‌కు అత్యంత ఇబ్బందికరమైన మార్కెట్లలో చైనా ముందుంది. తాజా త్రైమాసికంలో గ్రేటర్ చైనా ఆదాయం 22 శాతం పడిపోయింది. కరెన్సీ మార్పులను పరిగణనలోకి తీసుకుంటే క్షీణత 26 శాతంగా ఉంది. స్థానిక స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్లు బలపడటం, వినియోగదారుల అభిరుచుల్లో మార్పులు నైక్‌పై ప్రభావం చూపుతున్నాయి. ఆన్‌లైన్ విక్రయాల్లో థర్డ్ పార్టీ డిజిటల్ ఛానళ్లపై ఆధారపడటాన్ని తగ్గించి, జనవరి నుంచి విక్రయాలపై మరింత ప్రత్యక్ష నియంత్రణ సాధించాలని సంస్థ భావిస్తోంది. మరోవైపు ప్రత్యక్ష విక్రయాలపై గతంలో ఎక్కువగా ఆధారపడిన నైక్ ఇప్పుడు రిటైల్ భాగస్వాములతో సంబంధాలను తిరిగి బలోపేతం చేస్తోంది. ఉత్తర అమెరికాలో హోల్‌సేల్ విక్రయాలు 2 శాతం పెరిగినప్పటికీ, నైక్ డైరెక్ట్ విక్రయాలు 8 శాతం తగ్గాయి. డిజిటల్ విక్రయాల్లో 13 శాతం క్షీణత నమోదైంది. చైనా పతనం, స్పోర్ట్స్‌వేర్ బలహీనత, జోర్డాన్ బ్రాండ్ ఒత్తిడి, కాన్వర్స్ క్షీణత కలిసి నైక్ పునరుద్ధరణను కఠినంగా మారుస్తున్నాయి. కాన్వర్స్ ఆదాయం తాజా త్రైమాసికంలో ఏకంగా 28 శాతం పడిపోయింది. రన్నింగ్ విభాగంలో ఓన్, హోకా వంటి బ్రాండ్లు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. దీంతో నైక్ గతంలో ఉన్న ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి మరింత పోటీ ఎదుర్కొంటోంది.

కొత్త పేస్‌తో పునర్నిర్మాణం

సంస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు నైక్ "పేస్" పేరుతో భారీ పునర్వ్యవస్థీకరణ ప్రారంభించింది. సరఫరా వ్యవస్థలో మార్పులు, కొత్త సంస్థాగత నిర్మాణం, భౌగోళిక విభాగాల తగ్గింపు, ఉద్యోగాల కోత ఇందులో భాగంగా ఉన్నాయి. 2031 ఆర్థిక సంవత్సరం వరకు సుమారు 2.5 బిలియన్ డాలర్ల పొదుపు సాధించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ మార్పులకు దాదాపు 1 బిలియన్ డాలర్ల ముందస్తు వ్యయం అవసరం కానుంది. ప్రభావిత ఉద్యోగాలపై నిర్ణయాలు 2027 నుంచి ప్రారంభమవుతాయని నైక్ తెలిపింది. మరో కీలక అడుగుగా బెంగళూరులో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉత్తర అమెరికా వృద్ధి, స్థూల మార్జిన్ 42.8 శాతానికి మెరుగుదల, ఇన్వెంటరీ 3 శాతం తగ్గడం వంటి కొన్ని సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ చైనా పతనం, బలహీనమైన స్పోర్ట్స్‌వేర్, జోర్డాన్ బ్రాండ్ సమస్యలు, కాన్వర్స్ క్షీణత సంస్థపై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన వినియోగదారుల బ్రాండ్లలో ఒకటైన నైక్‌కు ఇప్పుడు కొత్త ఉత్పత్తులు మాత్రమే కాదు.. ఏ వ్యూహాలను కొనసాగించాలి, ఏవాటిని మార్చాలి, ఏవాటిని పూర్తిగా వదులుకోవాలన్నదే అసలు పరీక్షగా మారింది.

వర్షాలతో నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోవాలి



వేంపల్లి మండలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి, నిమ్మ, చీని రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా అధ్యక్షుడు ఎండీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. టీ.వెలమవారిపల్లె, కుప్పాలపల్లె, నందిపల్లె, తాళ్లపల్లె, బక్కన్నగారిపల్లె తదితర గ్రామాల్లో దెబ్బతిన్న అరటి తోటలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. పంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యం సంభవించడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని సుబ్బారెడ్డి తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి వెంటనే పరిహారం అందించాలని కోరారు. పంటల బీమా ప్రీమియం వసూలు చేస్తున్నప్పటికీ ఈక్రాప్ నమోదు జాప్యం జరుగుతోందని, పంట రుణాల ఆధారంగా బీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అరటికి టన్నుకు రూ.22 వేల మద్దతు ధర కల్పించాలని, ఉద్యాన శాఖ ద్వారా కొనుగోళ్లు చేపట్టాలని కోరారు.

ఘనంగా పినిపే విశ్వరూప్ జన్మదిన వేడుకలు



అమలాపురం రూరల్ భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు భారీ గజమాలతో విశ్వరూప్‌ను సత్కరించి, కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు, అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ డా. పినిపే శ్రీకాంత్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విపర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయెల్, కుడుపూడి సూర్యనారాయణ, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. పలువురు మండల పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలకు హాజరై విశ్వరూప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వార్షిక ఉద్యమంగా స్వచ్ఛథాన్



విజయవాడలో 10 వేల మందితో భారీ పరుగువిజయవాడ: పరిశుభ్రత,ఫిట్‌నెస్,బాధ్యతాయుత పౌరసత్వంపై అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్వచ్ఛథాన్-2026 ఘనంగా జరిగింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 23 రాష్ట్రాల నుంచి దాదాపు 10 వేల మంది పాల్గొన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల మీదుగా సాగింది. హాఫ్ మారథాన్ 21.1 కి.మీ., 10కె, 5కె విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ వయసుల పురుషులు, మహిళలకు కలిపి రూ.10 లక్షల నగదు బహుమతులు అందించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ స్వచ్ఛథాన్‌ను ఇకపై వార్షిక ఉద్యమంగా కొనసాగిస్తామని తెలిపారు.

స్వచ్ఛతలో కోనసీమకు 67 అవార్డులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు స్వచ్ఛతా రంగంలో 67 స్వచ్ఛాంధ్ర అవార్డులు దక్కాయి. అమలాపురం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-2026 పురస్కారాల కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాథుర్ బాలయోగి, కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటేనే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందుతుందని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు.

సేవాభావికి ఘనంగా సన్మానం



చీరాల రూరల్ మండలం దేవాంగపురి గ్రామంలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని సేవాభావంతో పనిచేస్తున్న గలబా వెంకట నారాయణను ఘనంగా సత్కరించారు. 'సేవా సంకల్ప అభియాన్ 'లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను దుశ్శాలువతో సన్మానించి, స్వామి వివేకానంద స్ఫూర్తిని అందించే పుస్తకాన్ని బహూకరించారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన పనుల్లో నారాయణ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, తనకు చేతనైన సహాయాన్ని అందిస్తున్నారని పలువురు కొనియాడారు. నిస్వార్థ సేవాభావంతో పనిచేసే వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మానవతా విలువలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు, శ్రీ స్వామి వివేకానంద అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ సెక్రటరీ డాక్టర్ నాసిక శివాజీ, పింజల శైలజ, యన్నం లక్ష్మీనారాయణ, బట్ట లక్ష్మి, ఎస్ .కె. కాశీతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాత్ముడి నిజమైన వారసులం :బండి



గాంధీ ఆశయాలను నెరవేరుస్తున్నాం

గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. జమ్మికుంటలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ ఆశయాలను అమలు చేస్తున్నది బీజేపీనేనని అన్నారు. గాంధీ ఆరాధించిన శ్రీరాముడిని కొందరు కాంగ్రెస్ నేతలు ధనికుల దేవుడిగా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సత్యం, ధర్మం, న్యాయం వంటి విలువలను గాంధీ పాటించారని గుర్తుచేస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలు, అవినీతితో నడుస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్వచ్ఛ భారత్, రామరాజ్యం వంటి గాంధీ ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఆయన రాజకీయ అభిప్రాయాలుగా ఆయన స్వయంగా వ్యక్తం చేసినవేనని తాజా నివేదికలు పేర్కొన్నాయి. ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీజేపీ గెలుపు కోసం హిందూ ఓటర్లను ఏకం చేస్తామని ఆయన ప్రకటించారు.

ఆటో ప్రయాణం.. మరింత భారం

కనీస ఛార్జీ ₹30కి పెంపు



తెలంగాణలో ఆటో ప్రయాణికులపై అదనపు భారం పడనుంది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు జీవో 46ను జారీ చేసి కొత్త ధరలను తక్షణమే అమల్లోకి తెచ్చింది. తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీని రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రతి కిలోమీటర్ కు రూ.15 చొప్పున వసూలు చేయాలి. గతంలో కనీస ఛార్జీ రూ.20గా, కిలోమీటర్ కు రూ.11గా ఉండేది. ట్రాఫిక్ లో ఆటో నిలిచినప్పుడు నిమిషానికి 75 పైసల వెయిటింగ్ ఛార్జీ వర్తిస్తుంది. కొత్త ఛార్జీలకు అనుగుణంగా మీటర్లను రీసెట్ చేసుకునేందుకు డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈ వ్యవధిలో డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది.

లగేజీకి అదనపు రుసుము

రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ ఛార్జీపై 50 శాతం అదనంగా చెల్లించాలి. హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటి వ్యక్తిగత సామగ్రిని ఉచితంగా తీసుకెళ్లవచ్చు. పెద్ద లగేజీకి కిలోమీటర్ కు 50 పైసలు అదనంగా వసూలు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగానే కొనసాగుతుంది. కొత్త ధరల వివరాలతో ఆటోల్లో ఫేర్ కార్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఛార్జీలు సవరించడం డ్రైవర్లకు ఉపశమనంగా భావిస్తోం ది.

ఛార్జీల పెంపు కోసం ఆటో సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఛార్జీల పెంపుతో డ్రైవర్లకు ప్రయోజనం కలిగినా, ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడనుంది.



తమిళనాడు మహిళలకు ఉచిత ప్రయాణం

గాంధీ జయంతి రోజున శ్రీకారం

తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ 'వెట్రి పయణం' పథకాన్ని శుక్రవారం చెన్నైలోని కోయంబేడు బస్ టెర్మినల్ లో ప్రారంభించారు. మహిళలు, ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరించేలా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా సీఎం విజయ్ స్వయంగా మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందించి పథకాన్ని ప్రారంభించారు. నగరాలు, పట్టణాల్లో ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ బస్సుల్లో మహిళలకు చార్జీ లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డినరీ బస్సులు, 40 కిలోమీటర్లకు మించిన ఘాట్ మార్గాల్లో నడిచే ఆర్డినరీ బస్సుల్లోనూ ఈ సౌకర్యం వర్తిస్తుంది.రోజుకు 84.32 లక్షల మందికి ప్రయోజనంఐదేళ్లుగా అమల్లో ఉన్న 'మగళిర్ విడియల్ పయణం' పథకాన్ని విస్తరించి వెట్రి పయణంగా అమలు చేస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా రోజుకు సుమారు 84.32 లక్షల మంది లబ్ధి పొందనున్నారు. ఏడు రాష్ట్ర రవాణా సంస్థలకు చెందిన మొత్తం 12,695 బస్సులను పథకం పరిధిలోకి తీసుకొచ్చారు.

వడగండ్ల వానకు అరటి పంట నేలమట్టం

దెబ్బతిన్న తోటలను పరిశీలించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



వేంపల్లి మండలంలో ఈదురుగాలులు, వడగండ్ల వానకు అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. తాళ్లపల్లి, కుప్పాలపల్లి, బక్కన్నగారిపల్లి, టీ.వెలమవారిపల్లి గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లో అరటి పంట నేలకొరిగింది. మరో నాలుగైదు రోజుల్లో కోతకు సిద్ధమైన సమయంలో ప్రకృతి వైపరీత్యం సంభవించడంతో రైతులు పెట్టుబడులు కోల్పోయారు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. 30 నుంచి 50 కిలోల బరువున్న అరటి గెలలు గాలులు, వడగండ్ల వానకు నేలకొరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న తోటలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరిశీలించి రైతులను పరామర్శించారు. పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు కనీసం రూ.50 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట బీమా పరిహారాన్ని ఆలస్యం చేయకుండా అందించాలని కోరారు. వెదర్ స్టేషన్ నమోదుల ఆధారంగా పరిహారం నిర్ణయించడం వల్ల రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని, బీమా విధానంలోని లోపాలను సరిచేసి బాధిత రైతులందరికీ పరిహారం అందించాలని అవినాష్‌రెడ్డి కోరారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

జలజీవన్ మిషన్ ప్రారంభోత్సవానికి అధికారుల సన్నాహాలు



ప్రొద్దుటూరులో ఈ నెల 5న జరగనున్న జలజీవన్ మిషన్ ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, ఎస్పీ ఫెక్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాలతో కలిసి శుక్రవారం అమృత్ నగర్, మున్సిపల్ లేఅవుట్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. సీఎం పర్యటన కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, సభా వేదిక, ఫైలాన్ పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని, చివరి నిమిషంలో లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో ఏపీ షేక్స్ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ .సి. భావన, జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఒకే వేదికపై చంద్రబాబు-పవన్.. ప్రొద్దుటూరులో సందడి!

ప్రొద్దుటూరులో అక్టోబర్ 5న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఇద్దరు నేతలు పాల్గొననున్నట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు, పవన్ కలిసి ప్రొద్దుటూరుకు రావడం ఇదే తొలిసారి కావడంతో స్థానికంగా ఆసక్తి నెలకొంది. పర్యటన నేపథ్యంలో అధికారులు సభా ప్రాంగణం, భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పర్యటన ఏర్పాట్లపై కూటమి నాయకులు, కార్యకర్తలతోనూ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

జర్నలిస్టులకు రక్షణ, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు



వనపర్తి గాంధీ చౌక్ లో జర్నలిస్టులు శుక్రవారం మహా ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావడంతో పాటు ప్రస్తుత ప్రెస్ కౌన్సిల్ స్థానంలో సమగ్ర అధికారాలతో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్, వనపర్తి జిల్లా నాయకులు మాధవరావు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ నిరసనలో జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సమాజానికి సమాచారాన్ని అందిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యంలకు జర్నలిస్టులు వినతి పత్రాలు అందజేశారు.

ఆటలంటే ప్రాణం.. పోటీలకు దూరమయ్యానని విషాద నిర్ణయం



పోటీకి దూరమైన బాలుడి విషాదం: ప్రొద్దుటూరులో తొమ్మిదో తరగతి విద్యార్థి నాగ అజయ్ (15) మృతి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈశ్వరరెడ్డినగర్ కు చెందిన అజయ్ రామేశ్వరంలోని మున్సిపల్ పాఠశాలలో చదువుతున్నాడు. చదువుతో పాటు క్రీడలంటే ఎంతో ఆసక్తి ఉన్న అతడు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాలని కోరుకునేవాడు. ఇటీవల కిందపడటంతో కాలికి గాయం కావడంతో తల్లిదండ్రులు కొద్దిరోజులు ఆటలకు దూరంగా ఉండాలని సూచించారు.

పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతున్న సమయంలో గాయం కారణంగా పాల్గొనలేకపోవడం అతడిని తీవ్రంగా కలచివేసినట్లు తెలుస్తోంది. పోటీలకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన అనంతరం ఇంట్లో అజయ్ అపస్మారకస్థితిలో కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.



గాంధీ, శాస్త్రిలకు ఆప్ నాయకుల నివాళులు

వేంపల్లెలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఆప్ కడప జిల్లా కోఆర్డినేటర్, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి రహమతుల్లా, జిల్లా సహాయ కన్వీనర్ దాదాపీర్ ఆధ్వర్యంలో ఇరువురు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ గాంధీజీ అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని, లాల్‌బహదూర్ శాస్త్రి నీతి, నిజాయితీ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. వారి జీవితం, ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

నిరాడంబరత, నిజాయితీకి శాస్త్రి ప్రతీక: కలెక్టర్

అమలాపురంలో మాజీ ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ శ్రీకృష్ణదేవరాయల స్టీట్ లోని శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రి జీవితం దేశ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. 1904 అక్టోబర్ 2న ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన శాస్త్రి చిన్ననాటి నుంచే కష్టాలను ఎదుర్కొంటూ విద్యాభ్యాసం కొనసాగించారని తెలిపారు. గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని సుమారు ఏడేళ్లు జైలు జీవితం గడిపారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పలు కీలక పదవులు నిర్వహించి ప్రధానిగా దేశానికి సేవలందించారని చెప్పారు. రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయడం ఆయన జవాబుదారీతనానికి నిదర్శనమన్నారు. "జై జవాన్-జై కిసాన్" నినాదంతో సైనికులు, రైతుల ప్రాధాన్యతను చాటిచెప్పారని గుర్తుచేశారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

అమలాపురం కలెక్టరేట్‌లో మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ బాపూజీ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. అక్టోబర్ 2న గాంధీజీ జన్మదినాన్ని ప్రపంచ అహింసా దినోత్సవంగా కూడా నిర్వహిస్తారని తెలిపారు.



ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

అమలాపురం పట్టణం ఈదరపల్లిలో మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పావులూరు వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ దేశానికి శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. నిరాడంబరత, నిజాయితీ, క్రమశిక్షణకు ఆయన నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.



పుతిన్.. పుట్టి ముంచుతాడా!?

యూరప్ ను రఫ్ఫాడిస్తామని రష్యా వార్నింగ్..

- అణు హెచ్చరికలతో పశ్చిమ దేశాలు షేకింగ్..
- అంచనాలకు అందని వ్యూహం.. పెనుముప్పు తప్పదని సందేహం



క్యాలినిన్‌గ్రాడ్ పేరు ఇప్పుడు భారతీయులకు కూడా ఆసక్తి కలిగించేలా ప్రపంచ వార్తల్లోకి వచ్చింది. మ్యాప్‌లో చూస్తే ఇది రష్యా ప్రధాన భూభాగానికి దూరంగా ఉన్న ఒక చిన్న ప్రాంతంలా కనిపిస్తుంది. కానీ భౌగోళికంగా చూస్తే ఇది రష్యాకు యూరప్ గుండెల్లో ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. ఒకవైపు బాల్టిక్ సముద్రం.. మరోవైపు నాటో సభ్యదేశాలైన పోలాండ్, లిథువేనియా.. మధ్యలో రష్యాకు చెందిన క్యాలినిన్‌గ్రాడ్. అంటే రష్యా ప్రధాన భూభాగం నుంచి విడిపోయి ఉన్న రష్యా ముక్క అన్నమాట. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతున్న సమయంలో యూరప్‌లో రష్యా–నాటో మధ్య అనుమానాలు పెరిగాయి. ఆ అనుమానాలకు క్యాలినిన్‌గ్రాడ్ మరింత సున్నితమైన కేంద్రంగా మారింది. ఈ ప్రాంతానికి వెళ్లే రవాణా మార్గాలు, సరఫరాలు, సైనిక కదలికలు, భద్రతా వ్యవస్థలపై ఏ చిన్న నిర్ణయం తీసుకున్నా దాని ప్రభావం రష్యా–నాటో సంబంధాలపై పడుతుంది. అందుకే పుతిన్ ఇక్కడి విషయంలో చాలా గట్టిగా మాట్లాడుతున్నారు. అసలు పుతిన్ దూకుడుకు కారణం క్యాలినిన్‌గ్రాడ్ పరిమాణం కాదు.. దాని వ్యూహాత్మక స్థానం. ఈ చిన్న ప్రాంతం రష్యాకు యూరప్‌పై ఒత్తిడి తెచ్చే సాధనం కూడా. అదే సమయంలో రష్యాపై ఒత్తిడి పెంచాలనుకునే యూరప్‌కు కూడా ఇది ఒక బలహీన బిందువుగా కనిపిస్తుంది. ఈ రెండు కోణాల మధ్యే అసలు ఉద్రిక్తత దాగి ఉంది.

- క్యాలినిన్‌గ్రాడ్... యూరప్ గుండెల్లో చిన్న రష్యా
- పుతిన్ ఎందుకింత దూకుడు?
- ప్రపంచానికి పెద్ద ముప్పు?
- చిన్న ప్రాంతం.. పెద్ద వ్యూహం

• జర్మన్ నగరం రష్యా ప్రాంతంగా ఎలా మారింది?

క్యాలినిన్‌గ్రాడ్ కథను అర్థం చేసుకోవాలంటే రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన కాలానికి వెళ్లాలి. అప్పట్లో ఈ ప్రాంతం జర్మనీకి చెందిన కోనిగ్స్‌బర్గ్ నగరం. 1945లో నాజీ జర్మనీ ఓటమి తర్వాత యూరప్ పటంలో భారీ మార్పులు జరిగాయి. కోనిగ్స్‌బర్గ్ ప్రాంతం సోవియట్ యూనియన్ ఆధీనంలోకి వెళ్లింది. తర్వాత దీనికి క్యాలినిన్‌గ్రాడ్ అనే పేరు వచ్చింది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన 1991 తర్వాత కూడా ఈ ప్రాంతం రష్యాలోనే కొనసాగింది. అయితే అప్పటికే ఒక విచిత్రమైన భౌగోళిక పరిస్థితి ఏర్పడింది. రష్యా ప్రధాన భూభాగం నుంచి క్యాలినిన్‌గ్రాడ్‌కు నేరుగా భూమార్గం లేకుండా పోయింది. మధ్యలో లిథువేనియా, పోలాండ్ వంటి దేశాలు ఉన్నాయి. ఒకప్పుడు ఇవి సోవియట్ ప్రభావ పరిధిలో ఉన్న ప్రాంతాలు. తర్వాత స్వతంత్ర దేశాలుగా మారాయి. మరింత కీలకంగా.. అవి నాటోలో చేరాయి. ఇక్కడే క్యాలినిన్‌గ్రాడ్ రష్యాకు భౌగోళిక సమస్య నుంచి వ్యూహాత్మక ఆస్తిగా మారింది. ఎందుకంటే రష్యా ప్రధాన భూభాగం నుంచి దూరంగా ఉన్నప్పటికీ, బాల్టిక్ సముద్రంలో రష్యాకు కీలకమైన సైనిక స్థావరంగా ఇది ఉంది. అక్కడి నుంచి బాల్టిక్ ప్రాంతాన్ని పర్యవేక్షించడం, సైనిక కార్యకలాపాలు నిర్వహించడం రష్యాకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. అందుకే మాస్కో దృష్టిలో క్యాలినిన్‌గ్రాడ్ సాధారణ ప్రాంతం కాదు. దాన్ని బలహీనపరిచే ఏ చర్యనైనా రష్యా తన భద్రతపై ఒత్తిడిగా భావించే అవకాశం ఉంది.

• నాటో చుట్టుముట్టిందన్న పుతిన్ భావన

సోవియట్ యూనియన్ పతనం తర్వాత రష్యా ప్రపంచ రాజకీయాల్లో తన పాత ప్రభావాన్ని కోల్పోయింది. మరోవైపు తూర్పు యూరప్‌లోని అనేక దేశాలు క్రమంగా నాటోలో చేరాయి. పోలాండ్, లిథువేనియా, లాట్వియా, ఎస్టోనియా వంటి దేశాలు నాటోలో భాగమయ్యాయి. రష్యా సరిహద్దులకు నాటో సైనిక కూటమి మరింత దగ్గరైంది. మాస్కోలో దీనిని చాలాకాలంగా భద్రతా ఆందోళనగా చూస్తున్నారు. పుతిన్ ప్రభుత్వం పదేపదే "నాటో విస్తరణ రష్యా భద్రతకు ముప్పు" అనే వాదనను ముందుకు తెచ్చింది. పాశ్చాత్య దేశాలు మాత్రం నాటోలో చేరడం ఆయా దేశాల స్వతంత్ర నిర్ణయమని చెబుతున్నాయి. ఈ రెండు వాదనల మధ్య విభేదం ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఈ విభేదం మరింత తీవ్రంగా మారింది. రష్యా దృష్టిలో చూస్తే క్యాలినిన్‌గ్రాడ్ చుట్టూ ఇప్పుడు నాటో సభ్యదేశాలు ఉన్నాయి. అంటే తన ప్రాంతం చుట్టూ ప్రత్యర్థి సైనిక కూటమి విస్తరించినట్టుగా మాస్కో భావిస్తోంది. యూరప్ దృష్టిలో చూస్తే మాత్రం రష్యా సైనిక శక్తి తమ సరిహద్దుల దగ్గరే ఉంది. అందుకే రెండు వైపులా భద్రతా భయం ఉంది. రష్యా "మమ్మల్ని చుట్టుముట్టుతున్నారు" అంటోంది.. నాటో దేశాలు "మమ్మల్ని బెదిరిస్తున్నారు" అంటున్నాయి. ఈ పరస్పర అనుమానమే అసలు సమస్య. క్యాలినిన్‌గ్రాడ్ ఆ అనుమానాలకు అత్యంత స్పష్టమైన భౌగోళిక రూపం.

• ఉక్రెయిన్ యుద్ధంతో పెరిగిన మంట?

2022లో రష్యా ఉక్రెయిన్‌పై పూర్తి స్థాయి సైనిక చర్య ప్రారంభించిన తర్వాత యూరప్ భద్రతా సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. అంతకుముందు రష్యా–నాటో మధ్య ఉద్రిక్తత ఉన్నప్పటికీ ప్రత్యక్ష యుద్ధాన్ని నివారించేందుకు రెండు వైపులా జాగ్రత్త ఉండేది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పరిస్థితి మారింది. అమెరికా, యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు, ఆర్థిక సహాయం అందించాయి. రష్యా దీనిని పాశ్చాత్య దేశాలు తమపై పరోక్ష యుద్ధం చేస్తున్నట్లుగా అభివర్ణించింది. నాటో మాత్రం తాము రష్యాతో ప్రత్యక్ష యుద్ధంలో లేమని చెబుతూ ఉక్రెయిన్‌కు మద్దతు కొనసాగించింది. ఇదే సమయంలో పోలాండ్, బాల్టిక్ దేశాల్లో రష్యా భవిష్యత్ చర్యలపై ఆందోళన పెరిగింది. "ఉక్రెయిన్ తర్వాత ఎవరు?" అనే ప్రశ్న యూరప్ భద్రతా చర్చల్లో వినిపించింది. రష్యా మాత్రం తనపై పాశ్చాత్య దేశాలు వ్యూహాత్మక ఒత్తిడి పెంచుతున్నాయని ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో క్యాలినిన్‌గ్రాడ్ ప్రాధాన్యం ఒక్కసారిగా పెరిగింది. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం చేస్తుంటే.. యూరప్ దాని సరిహద్దుల దగ్గర రక్షణ బలపరుస్తోంది. రష్యా దాన్ని గమనిస్తూ తన సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. ఇదే పరస్పర చర్య ఇప్పుడు ప్రమాదకరమైన చక్రంలా మారుతోంది. ఒకవైపు నాటో దేశాలు తమ భద్రత కోసం సైనిక సిద్ధత పెంచుతున్నాయి. మరోవైపు రష్యా దానిని తనపై దాడికి ముందస్తు ఏర్పాటుగా భావించే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో క్యాలినిన్‌గ్రాడ్‌కు సంబంధించిన చిన్న నిర్ణయం కూడా పెద్ద రాజకీయ సందేశంగా మారుతోంది.

• అణ్వాయుధాల మాట పుతిన్ ఎందుకు తెస్తున్నారు?

ఇక్కడే పుతిన్ దూకుడు మాటలకు అసలు అర్థం తెలుస్తుంది. రష్యా సంప్రదాయ సైనిక సామర్థ్యం గురించి ఎలాంటి విశ్లేషణ ఉన్నా, అణ్వాయుధాల విషయంలో మాత్రం మాస్కో ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశాల్లో ఒకటి. సోవియట్ యూనియన్ కాలం నుంచి నిర్మించిన భారీ అణు ఆయుధ సామర్థ్యంలో గణనీయమైన భాగం రష్యాకు వచ్చింది. అందుకే పుతిన్ తరచూ అణు సామర్థ్యాన్ని రష్యా భద్రతకు చివరి నిరోధక శక్తిగా ప్రస్తావిస్తారు. క్యాలినిన్‌గ్రాడ్‌పై ప్రత్యక్ష దాడి జరిగితే అన్ని రకాల ఆయుధాల వినియోగాన్ని పరిగణించాల్సి వస్తుందని ఆయన చేసిన హెచ్చరికను ఈ నేపథ్యంతో చూడాలి. ఇది వెంటనే అణ్వాయుధాలు ప్రయోగిస్తామని ప్రకటించడం కాదు. ప్రత్యర్థికి "ఈ గీత దాటొద్దు" అనే తీవ్రమైన హెచ్చరిక ఇవ్వడం కూడా అణు నిరోధక వ్యూహంలో భాగమే. ఎందుకంటే అణ్వాయుధాల అసలు ఉద్దేశం కేవలం యుద్ధంలో ఉపయోగించడం మాత్రమే కాదు. వాటి ఉనికే ప్రత్యర్థిని ప్రత్యక్ష ఘర్షణకు దూరంగా ఉంచే సాధనంగా పనిచేస్తుంది. రష్యా ఒకవైపు తన అణు సామర్థ్యాన్ని ప్రస్తావిస్తే.. నాటో కూడా తన అణు నిరోధక సామర్థ్యాన్ని గుర్తుచేస్తోంది. ఇక్కడే ప్రమాదం ఉంది. ఒక చిన్న ప్రాంతం కోసం రెండు అణ్వాయుధ శక్తుల మధ్య ప్రత్యక్ష ఘర్షణ ఏర్పడితే పరిణామాలు కేవలం యూరప్‌కే పరిమితం కావు. అందుకే పుతిన్ మాటలను తేలికగా తీసుకోలేం. అదే సమయంలో ప్రతి అణు హెచ్చరికను వెంటనే అణుయుద్ధానికి సంకేతంగా భావించడం కూడా సరైనది కాదు. ఇది ప్రధానంగా నిరోధక శక్తి, ఒత్తిడి, ఎర్రగీతల రాజకీయాల మధ్య జరుగుతున్న పోరాటం.

• అమెరికా వెనక్కి తగ్గితే ఏం జరుగుతుంది?

యూరప్ భద్రతా వ్యవస్థలో అమెరికా పాత్రను అర్థం చేసుకోకుండా క్యాలినిన్‌గ్రాడ్ సమస్యను పూర్తిగా అర్థం చేసుకోవడం కష్టం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన నాటో వ్యవస్థలో అమెరికా ప్రధాన సైనిక శక్తిగా ఉంది. యూరప్‌లోని అనేక దేశాలకు అమెరికా రక్షణ హామీ ఒక భద్రతా గొడుగులా పనిచేసింది. ఫ్రాన్స్, బ్రిటన్‌లకు స్వంత అణ్వాయుధ సామర్థ్యం ఉన్నప్పటికీ మొత్తం యూరప్ భద్రతా నిర్మాణంలో అమెరికా పాత్ర ప్రత్యేకమైనది. ఇప్పుడు అమెరికా విదేశాంగ విధానంలో మార్పులు, ట్రంప్ పాలనలో యూరప్‌పై పెరిగిన బాధ్యతల చర్చ కారణంగా కొన్ని యూరోపియన్ దేశాల్లో అమెరికా భద్రతా హామీపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీని ఫలితంగా యూరప్ తన స్వంత రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలని చూస్తోంది. మరోవైపు రష్యా కూడా ఈ మార్పులను గమనిస్తోంది. అమెరికా యూరప్ భద్రతలో ఎంత బలంగా ఉంటుందన్నది రష్యా–నాటో సమీకరణంపై ప్రభావం చూపే అంశం. అమెరికా బలమైన నిరోధక పాత్ర పోషిస్తే రష్యా ప్రత్యక్షంగా నాటోతో తలపడే ప్రమాదం తగ్గవచ్చని భావించే విశ్లేషణలు ఉన్నాయి. అదే సమయంలో అమెరికా పాత్ర తగ్గితే యూరప్ స్వతంత్రంగా మరింత సైనిక శక్తిని పెంచుకోవచ్చు. అది రష్యాకు మరో ఒత్తిడిగా కనిపించే అవకాశం ఉంది. దీంతో భద్రత కోసం తీసుకునే ప్రతి చర్య ప్రత్యర్థికి ముప్పుగా కనిపించే ప్రమాదం ఏర్పడుతుంది.

• యుద్ధం కంటే ప్రమాదకరమైనది అపార్థం

ఈ మొత్తం కథలో అత్యంత ముఖ్యమైన విషయం ఒక్కటే. క్యాలినిన్‌గ్రాడ్ కారణంగా రేపే ప్రపంచ యుద్ధం మొదలవుతుందని చెప్పడానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఆధారం లేదు. కానీ అక్కడి పరిణామాలు రష్యా–నాటో మధ్య ప్రత్యక్ష ఘర్షణకు దారితీసే ప్రమాదాన్ని పూర్తిగా విస్మరించలేం. ఆధునిక యుద్ధం ఇప్పుడు కేవలం ట్యాంకులు, యుద్ధ విమానాలు, నౌకలు, అణుబాంబులకే పరిమితం కాలేదు. డ్రోన్లు, సైబర్ దాడులు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, ఉపగ్రహ నిఘా, దీర్ఘదూర క్షిపణులు కూడా యుద్ధంలో కీలకంగా మారాయి. అంటే యుద్ధం మొదలవ్వడానికి ఒక పెద్ద బాంబు పడాల్సిన అవసరం లేదు. ఒక తప్పు అంచనా, ఒక పొరపాటు దాడి, ఒక తప్పుగా అర్థం చేసుకున్న సైనిక కదలిక కూడా సంక్షోభాన్ని పెంచగలదు. అందుకే పుతిన్ దూకుడు మాటల వెనుక ప్రధాన లక్ష్యం తన ఎర్రగీతలను ప్రత్యర్థికి స్పష్టంగా తెలియజేయడమే కావచ్చు. "క్యాలినిన్‌గ్రాడ్‌ను తాకొద్దు.. రష్యా భద్రతను పరీక్షించొద్దు" అనే సందేశాన్ని మాస్కో బలంగా ఇస్తోంది. నాటో మాత్రం తమ సభ్యదేశాల భద్రత విషయంలో వెనక్కి తగ్గబోమని చెబుతోంది. ఈ రెండు వైపుల మధ్య సమతుల్యతే కీలకం. భారతీయులకు ఈ కథలో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. యూరప్‌లో జరిగే ఇలాంటి ఘర్షణలు కేవలం యూరప్ సమస్యలు కావు. చమురు ధరలు, గ్యాస్ సరఫరాలు, ప్రపంచ వాణిజ్యం, ఆహార ధరలు, అంతర్జాతీయ మార్కెట్లు, రక్షణ వ్యయం వంటి అనేక అంశాలపై ప్రభావం పడుతుంది. అందుకే క్యాలినిన్‌గ్రాడ్ ఒక చిన్న ప్రాంతం అయినా దాని చుట్టూ జరుగుతున్న పరిణామాలు ప్రపంచానికి పెద్ద సంకేతాలు ఇస్తున్నాయి. ఇది యుద్ధం మొదలయ్యే కథ కంటే.. యుద్ధం మొదలుకాకుండా అడ్డుకోవాల్సిన కథ. రష్యా తన భద్రతను కాపాడుకోవాలని చూస్తోంది. నాటో తన సభ్యదేశాలను రక్షించుకోవాలని చూస్తోంది. అమెరికా తన పాత్రను ఎలా నిర్వచిస్తుందన్నది మరో కీలక అంశం. ఈ మూడు శక్తుల మధ్య సంభాషణ కొనసాగితే ఉద్రిక్తత నియంత్రణలో ఉండే అవకాశం ఉంటుంది. సంభాషణ బలహీనపడితే చిన్న క్యాలినిన్‌గ్రాడ్ కూడా ప్రపంచ భద్రతా సమీకరణాలను కుదిపే కేంద్రంగా మారవచ్చు.



- డాక్టర్ పెంటపాటి పుల్లారావు,
రాజకీయ, అంతర్జాతీయ విశ్లేషకులు



• క్యాలినిన్‌గ్రాడ్ పుతిన్ బలమా? బలహీనతా?

ఇప్పుడు అసలు ప్రశ్న ఇదే. క్యాలినిన్‌గ్రాడ్ రష్యాకు బలమా? లేక నాటో మధ్యలో చిక్కుకున్న బలహీన ప్రాంతమా? వాస్తవానికి రెండూ. వ్యూహాత్మకంగా ఇది రష్యాకు చాలా విలువైన ప్రాంతం. బాల్టిక్ సముద్ర ప్రాంతంలో రష్యా సైనిక ఉనికిని కొనసాగించేందుకు ఇది కీలకం. అదే సమయంలో రష్యా ప్రధాన భూభాగంతో నేరుగా అనుసంధానం లేకపోవడం దీని బలహీనత. రష్యాకు క్యాలినిన్‌గ్రాడ్‌ను రక్షించడం అంటే దూరంగా ఉన్న ఒక ప్రాంతాన్ని నిరంతరం సరఫరా చేయడం. భూమార్గం కోసం ఇతర దేశాల భూభాగం అవసరం. సముద్ర మార్గాలపై ఆధారపడాలి. గగన మార్గం కూడా ఉంటుంది. అందుకే ఈ ప్రాంతం చుట్టూ రవాణా సమస్యలు వచ్చినప్పుడు మాస్కో చాలా సున్నితంగా స్పందిస్తుంది. నాటో దేశాలు దీనిని రష్యాపై ఒత్తిడి సాధనంగా చూస్తే.. రష్యా మాత్రం దాన్ని తన సార్వభౌమత్వంపై సవాలుగా భావించవచ్చు. ఇక్కడ మరో కీలక అంశం ఉంది. నాటోలోని పోలాండ్, లిథువేనియా వంటి దేశాలు రష్యాతో ప్రత్యక్ష యుద్ధాన్ని కోరుకుంటున్నాయని చెప్పడానికి కేవలం క్యాలినిన్‌గ్రాడ్ చుట్టూ ఉద్రిక్తత పెరగడం సరిపోదు. అదే సమయంలో రష్యా కూడా ప్రతి ఒత్తిడికి యుద్ధంతోనే సమాధానం ఇస్తుందని చెప్పలేం. సాధారణంగా ఇలాంటి సంక్షోభాల్లో ముందుగా దౌత్య హెచ్చరికలు, ఆర్థిక ఒత్తిడి, సైనిక విన్యాసాలు, గగనతల పర్యవేక్షణ, సైబర్ చర్యలు, సమాచార యుద్ధం వంటి మార్గాలు ఉపయోగిస్తారు. కానీ చరిత్ర చెప్పే హెచ్చరిక మాత్రం వేరే. చిన్న సంఘటనలు కూడా కొన్ని సందర్భాల్లో పెద్ద యుద్ధాలకు దారి తీశాయి. అందుకే క్యాలినిన్‌గ్రాడ్ విషయంలో ఒక్కో అడుగు ప్రపంచం నిశితంగా గమనిస్తోంది.

ఓటమే గెలుపునకు మొదటి మెట్టు

పాత ఫార్ములాతో జగన్ బెట్టు

ఎమ్మెల్యే, ఎంపీలుగా ఫెయిల్.. ఓడిన గుర్రాలను దింపడం జగన్ స్టైల్



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక ఎన్నికల వేడి ఇంకా అధికారిక నోటిఫికేషన్ దశకు చేరకముందే పార్టీల అంతర్గత రాజకీయాలను వేడెక్కిస్తోంది. ముఖ్యంగా వైసీపీలో ఇప్పుడు అసలు పోరాటం కూటమితో కాదన్న వాదన పార్టీ అంతర్గతంగా బలంగా వినిపిస్తోంది. ముందుగా జరగాల్సింది టికెట్ల కోసం ఇంటిపోరే అన్న చర్చ మొదలైంది. ఐదేళ్లు పార్టీ కోసం తిరిగిన స్థానిక కార్యకర్తకు అవకాశం ఇవ్వాలా? లేక నిన్న మొన్నటి వరకు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి అంటూ అధికారాన్ని అనుభవించి 2024లో ఓడిపోయిన పాత ముఖానికే మళ్లీ స్థానిక పదవి కట్టబెట్టాలా? ఇదే ప్రశ్న ఇప్పుడు వైసీపీ నాయకత్వం ముందున్న అతిపెద్ద చిక్కు. స్థానిక ఎన్నికలను 2029 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేయడానికి ఉపయోగించుకోవాలన్న ఆలోచనలో జగన్ ఉన్నట్టు ఆయన ఇటీవల పార్టీ సమావేశాల్లో ఇచ్చిన దిశానిర్దేశం చూస్తే అర్థమవుతోంది. సెప్టెంబర్ 24న తాడేపల్లిలో ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశమైన జగన్ బలమైన, విశ్వసనీయమైన అభ్యర్థులను ముందుగానే గుర్తించాలని, అన్ని స్థాయిల నాయకులతో మాట్లాడి, పలు దఫాలుగా చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ఇప్పటి నిర్ణయమే కాకుండా భవిష్యత్ ఎన్నికలకు పార్టీ పునాదిని బలోపేతం చేసేలా ఉండాలని కూడా సూచించారు. అక్టోబర్ 1న అయితే దాదాపు తొమ్మిది గంటలపాటు ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, సీనియర్ నేతలతో జిల్లాల వారీగా సమీక్షలు జరిగాయి. అంటే స్థానిక ఎన్నికలు వైసీపీకి సాధారణ ఎన్నికలు కావు. పార్టీకి మిగిలిన బలం ఎంత? నేలమీద ఎవరు ఉన్నారు? ఎక్కడ కార్యకర్త ఉన్నాడు? ఎక్కడ నాయకుడు కనిపించడం లేదు? ఎక్కడ అభ్యర్థి దొరకడం లేదు? అన్న లెక్కలు తేల్చుకునే పరీక్షగా వైసీపీ నాయకత్వం చూస్తోంది.



• పార్టీ ఎవరిది.. పట్టు ఎవరిది.. పీఠం ఎవరిది?

అయితే వైసీపీ నాయకత్వం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న పేర్లది కాదు. 'పార్టీ ఎవరిది?' అన్నదే. అధికారం ఉన్నప్పుడు నాయకత్వం చుట్టూ తిరిగిన పెద్ద నేతలు, అధికారం పోయిన తర్వాత కూడా పార్టీ రాజకీయాన్ని తమ చుట్టూ తిప్పుకుంటే కిందిస్థాయి నాయకత్వం ఎక్కడికి వెళుతుంది? ఒక పార్టీకి మాజీ మంత్రి అవసరం కావచ్చు. మాజీ ఎమ్మెల్యే అవసరం కావచ్చు. మాజీ ఎంపీ అవసరం కావచ్చు. కానీ అదే సమయంలో బూత్ స్థాయిలో ఓటు తెచ్చే వ్యక్తి కూడా అవసరం. ఒకడు ప్రచార వేదికపై మాట్లాడతాడు. మరొకడు ఇంటింటికీ వెళ్లి ఓటు అడుగుతాడు. ఎన్నికల రోజు పోలింగ్ బూత్ దగ్గర కూర్చునేది ఎవరో కూడా పార్టీకి తెలుసు. అందుకే మాజీ ప్రజాప్రతినిధికి పదవి ఇవ్వడం ద్వారా పాత నాయకుడికి రాజకీయ పునరావాసం కల్పించవచ్చు. కానీ స్థానిక కార్యకర్తను పక్కనపెట్టి అదే చేస్తే పార్టీ భవిష్యత్తు నాయకత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఇది కేవలం వైసీపీ సమస్య కాదు. ప్రతి రాజకీయ పార్టీకి పట్టించే సంస్థాగత సత్యం. జగన్ ముందు మరో లెక్క కూడా ఉంది. స్థానిక ఎన్నికలను 2029 అసెంబ్లీ ఎన్నికలకు రాజకీయంగా ఉపయోగించుకోవాలంటే ఓటర్లతో పార్టీకి నిరంతర సంబంధం ఉండాలి. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లా స్థాయిలో పార్టీకి ప్రతినిధులు లేకపోతే అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక్కసారిగా యంత్రాంగాన్ని నిర్మించడం కష్టం. అందుకే జగన్ తాజాగా అభ్యర్థుల ఎంపికను భవిష్యత్ ఎన్నికలకు కూడా ఉపయోగపడేలా చేయాలని చెప్పారు. ఆ ఆలోచనలో తర్కం ఉంది. కానీ ఆ తర్కాన్ని అమలు చేసే విధానం కీలకం. మాజీ నాయకుడిని నిలబెట్టడం ద్వారా అతని రాజకీయ పునరాగమనానికి అవకాశం కల్పించడం ఒక వ్యూహం. అదే సమయంలో స్థానిక కార్యకర్తకు రెండో వరుసలోనైనా బాధ్యత ఇవ్వడం మరో వ్యూహం. రెండింటినీ కలపకపోతే ఒక వర్గాన్ని గెలిపించడానికి మరో వర్గాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది.



అన్న ప్రశ్నలకు సమాధానం. మాజీ నేత అయితే అతని గతం బలం కావాలి.. భారంగా మారకూడదు. స్థానిక కార్యకర్త అయితే అతని ఉత్సాహం ఓటుగా మారాలి.. కేవలం పార్టీ విధేయతగా మిగలకూడదు. ఈ రెండు అంచుల మధ్య సమతుల్యం సాధించగలిగితేనే స్థానిక ఎన్నికలు వైసీపీకి సంస్థాగత పునర్నిర్మాణానికి వేదిక అవుతాయి. లేకపోతే మాత్రం ఒక ప్రమాదం తప్పదు. ఎన్నికల్లో ఓడిపోయిన పెద్ద నేతకు మరో పదవి దొరుకుతుంది. ఫొటోలు మారతాయి. బ్యానర్లు మారతాయి. సమావేశాలు జరుగుతాయి. కానీ కింద ఉన్న కార్యకర్త మాత్రం అదే ప్రశ్న అడుగుతూనే ఉంటాడు... "అధికారంలో ఉన్నప్పుడు మీరే.. ఓడిపోయిన తర్వాత కూడా మీరే అయితే.. మరి మేమెప్పుడు?" ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేని పార్టీకి ఎన్ని బలమైన అభ్యర్థులు ఉన్నా, నేలమీద బలం ఎంత అన్నది మాత్రం ఎన్నికలే తేల్చాలి. స్థానిక ఎన్నికలు అందుకే జగన్‌కు కేవలం మేయర్, చైర్‌పర్సన్, జెడ్పీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవుల పోరు కాదు. ఇవి వైసీపీకి పాత నాయకత్వాన్ని కాపాడుకోవాలా.. కొత్త స్థానిక నాయకత్వాన్ని తయారు చేయాలా.. లేక రెండింటినీ కలిపి కొత్త రాజకీయ నిర్మాణాన్ని తయారు చేయాలా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పే పరీక్ష. 2024 తీర్పు తర్వాత వైసీపీకి ఇప్పుడు అవసరమైనది పాత విజయగాథను మళ్లీ చదవడం కాదు. ఆ విజయగాథ ఎందుకు ముగిసిందో చదవడం. అక్కడినుంచి కొత్త పాఠం రాయడం. తాడేపల్లిలో తయారయ్యే అభ్యర్థుల జాబితా ఆ పాఠానికి తొలి పేజీ కావచ్చు. అదే జాబితా పాత రాజకీయాల మరో పునరావృతిగా మారితే మాత్రం.. స్థానికం పేరుతో మరోసారి పెద్దలకే సింహాసనం కట్టబెట్టినట్టవుతుంది.

ఓడిన వారే... గెలుపు గుర్రాలా?

- మేయర్, జెడ్పీ చైర్మన్ అభ్యర్థులు ఖరారు
- రేసులో మాజీ మంత్రులు.. మాజీ ఎంపీలు
- పాత ప్రయోగాల బాటలోనే జగన్..
- స్థానిక ఎన్నికల్లో మరోసారి సాహసం..!

• పెద్దల బలం.. కార్యకర్తల బలం.. ఎవరి గెలుపు?

ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థి అంటే ఎవరు? ప్రజల మధ్య తిరిగే కార్యకర్తా? లేక గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేసిన అనుభవజ్ఞుడా? వైసీపీ నాయకత్వం రెండో వాదన వైపు మొగ్గుచూపుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కారణం కూడా స్పష్టమే. అధికారంలో ఉన్నప్పుడు పదవులు, పనులు, రాజకీయ ప్రభావం ఉన్నవారికి ఎన్నికల ఖర్చును భరించే సామర్థ్యం ఉంటుంది. పార్టీ యంత్రాంగాన్ని కదిలించే పరిచయాలు ఉంటాయి. అధికార యంత్రాంగంతో వ్యవహరించిన అనుభవం ఉంటుంది. మరోవైపు ఐదేళ్లుగా గ్రామంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తకు ఉత్సాహం ఉన్నా ఆర్థిక శక్తి ఉండకపోవచ్చు. అధికార మార్పు తర్వాత కేసులు, ఒత్తిళ్లు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వైసీపీ నాయకులు అధిష్ఠానానికి చెబుతున్నట్టు పలు అంశాలు తెరపైకి వచ్చాయి. తాజాగా జగన్ అభ్యర్థుల ఎంపికలో సైతం స్థానిక పరిస్థితులు, ప్రజల ఆమోదం, సంస్థాగత బలం, పార్టీ పట్ల నిబద్ధతను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. అందుకే వైసీపీ అధిష్ఠానం ముందు ఒక విచిత్రమైన సమీకరణ నిలిచింది. స్థానికుడికి టికెట్ ఇస్తే పార్టీకి కొత్త ముఖం దొరుకుతుంది. ఓడిపోయిన పెద్ద నేతకు టికెట్ ఇస్తే ఎన్నికల్లో ఖర్చు పెట్టే శక్తి, గత పరిచయాలు, రాజకీయ గుర్తింపు దొరుకుతాయి. కానీ రెండోది మొదటిదాన్ని చంపేస్తే? అక్కడే అసలు ప్రమాదం.

• కొత్త ముఖాల నాడు గెలుపు.. నేడు ఓటమి పాఠం

2019లో జగన్ అనుసరించిన ప్రయోగాలను గుర్తు చేసుకోకుండా ఈ చర్చను అర్థం చేసుకోవడం కష్టం. 2019లో వైసీపీ భారీ స్థాయిలో కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చింది. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినప్పుడు గతంలో ఉన్న అనేక సిట్టింగ్ ముఖాలను పక్కన పెట్టి కొత్త సమీకరణాలకు వెళ్లింది. ఆ సమయంలో పార్టీ వ్యూహం ఫలించింది. 2019లో వైసీపీ 151 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. అయితే ఆ విజయం మొత్తాన్ని కేవలం కొత్త అభ్యర్థుల ప్రయోగం ఫలితంగా చెప్పడం కూడా చరిత్రను అతిగా సరళీకరించడం అవుతుంది. అప్పటి ప్రభుత్వ వ్యతిరేకత, జగన్ పాదయాత్ర, సంక్షేమ హామీలు, రాజకీయ పరిస్థితులు, కూటమి లేకపోవడం వంటి అనేక అంశాలు కలిసి పనిచేశాయి. అయినా అభ్యర్థుల ఎంపికలో జగన్ తీసుకున్న సాహసం మాత్రం ఆ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. 2019లో వైసీపీ విడుదల చేసిన జాబితాపై అప్పటి వార్తా నివేదికలు కూడా చాలా మంది సిట్టింగ్ ఎంపీలను మార్చిన విషయాన్ని నమోదు చేశాయి. కానీ రాజకీయాల్లో ఒకసారి పనిచేసిన ఫార్ములాను అదే రూపంలో మరోసారి ప్రయోగిస్తే ఫలితం అదే వస్తుందన్న గ్యారంటీ ఉండదు. 2024 దీనికి పెద్ద ఉదాహరణ. వైసీపీ కేవలం 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైంది. అంటే 2019లో పనిచేసిన 'పాత ముఖాల్ని మార్చి-కొత్త ముఖాలను చేర్చి' అనే ప్రయోగాన్ని యథాతథంగా పునరావృతం చేయడం సరిపోదని 2024 ఫలితం ఒక రాజకీయ సందేశాన్ని ఇచ్చింది. ఇప్పుడు స్థానిక ఎన్నికల్లో ఆ పాఠాన్ని జగన్ ఎలా చదువుతారన్నదే కీలకం.

• పెద్ద పేరు.. కొత్త పోరు.. మారిన లెక్క..

ఇక్కడ మరో మలుపు ఉంది. మున్సిపల్ ఎన్నికల స్వరూపమే మారింది. ఆంధ్రప్రదేశ్‌లో 2026 చట్టసవరణల తర్వాత మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్లు ప్రజల ప్రత్యక్ష ఓటుతో ఎన్నికయ్యే విధంగా నిబంధనలు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 5న ప్రభుత్వం సంబంధిత ఎన్నికల నియమాలను జారీ చేసింది. మేయర్, చైర్‌పర్సన్ ఎన్నికతో పాటు వార్డు సభ్యుల ఎన్నిక జరుగుతుంది... డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక మాత్రం పరోక్ష విధానంలో ఉంటుంది. ఈ మార్పు రాజకీయ పార్టీల లెక్కలనే మార్చేస్తుంది. గతంలో ఒక మున్సిపాలిటీలో వార్డు వారీగా అభ్యర్థులను నిలబెట్టి, కౌన్సిలర్ల బలంతో చైర్‌పర్సన్‌ను నిర్ణయించే లెక్క ఉండేది. ఇప్పుడు మేయర్ లేదా చైర్‌పర్సన్ కోసం ఒక పెద్ద ముఖాన్ని ముందుకు తెచ్చి మొత్తం పట్టణంలో పార్టీ బ్రాండ్‌ను ఆ వ్యక్తి చుట్టూ తిప్పే అవకాశం ఉంది. ఇదే జగన్ లెక్కలోని ప్రధాన అంశంగా కనిపిస్తోంది. పెద్ద పేరు ఉన్న అభ్యర్థి ఉంటే అతని వ్యక్తిగత ఓటు, పరిచయాలు, ప్రచార సామర్థ్యం కింద ఉన్న వార్డు అభ్యర్థులకు కూడా ఉపయోగపడతాయని వైసీపీ భావిస్తోంది. కానీ దీనికి మరో వైపు ఉంది. పట్టణమంతా ఓటు వేసే ప్రత్యక్ష ఎన్నికలో అభ్యర్థి వ్యక్తిగత ప్రజాదరణే పార్టీకి బలమవుతుంది. అదే అభ్యర్థి గతంలో ఓడిపోయి ఉంటే, ఆ ఓటమి గుర్తును కూడా పట్టణమంతా మళ్లీ గుర్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే 'పెద్ద పేరు' అనేది ఎప్పుడూ 'పెద్ద బలం' కాదు.

• బలం ఎవరిది.. బరిలో ఎవరిది.. గెలుపు ఎవరిది?

వైసీపీకి ప్రస్తుతం ఇదే ద్వంద్వం. ఒకవైపు పార్టీ అధ్యక్షుడు 'బలమైన అభ్యర్థులు' కావాలని చెబుతున్నారు. మరోవైపు 'బలం' అనే పదానికి పార్టీ కిందిస్థాయి నాయకత్వం ఇచ్చే అర్థం వేరు. గ్రామంలో ఐదేళ్లు పార్టీ కోసం పనిచేసిన వ్యక్తికి బలం అంటే అతని కుటుంబం, అతని సామాజిక సంబంధాలు, అతని వ్యక్తిగత పలుకుబడి, ప్రజల్లో అతని అందుబాటు. కానీ అధిష్ఠానానికి బలం అంటే ఎన్నికల ఖర్చు భరించే శక్తి, గత రాజకీయ అనుభవం, పరిచయాలు, ఓటర్లపై ప్రభావం, ప్రచారాన్ని నిర్వహించే సామర్థ్యం కావచ్చు. ఈ రెండు నిర్వచనాలు ఒకటే కాకపోతే పార్టీ లోపల అసంతృప్తి రావడం సహజం. 'మేము అధికారంలో ఉన్నప్పుడు జెండా మోశాం.. ఇప్పుడు ఓడిపోయిన వాళ్లను మళ్లీ పదవుల్లో కూర్చోబెట్టడానికేనా?' అని కార్యకర్త ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పడం నాయకత్వానికి అంత సులభం కాదు. ముఖ్యంగా 2024 తర్వాత వైసీపీ అధికారాన్ని కోల్పోయిన పరిస్థితిలో, పార్టీకి మళ్లీ జీవం పోయాలంటే కిందిస్థాయి నాయకత్వానికి రాజకీయ భవిష్యత్తు ఉందన్న నమ్మకం కల్పించాల్సిందే. అందుకే జిల్లాల వారీగా ప్రచారంలోకి వస్తున్న పేర్లను కూడా జాగ్రత్తగా చూడాలి. పులివెందుల మున్సిపాలిటీ నుంచి వైఎస్ దుష్యంత్ రెడ్డి పేరు వినిపిస్తోందన్న చర్చ ఉంది. నెల్లూరు మేయర్ విషయంలో మాజీ సేవాదళ్ అధ్యక్షుడు ఎం. సుధీర్ కుమార్‌రెడ్డి, అనం కుటుంబానికి చెందిన ఏసీ సుబ్బారెడ్డి, డాక్టర్ రాధామాధవి వంటి పేర్లు పరిశీలనలో ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. విశాఖలో మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకుల పేర్లు చర్చకు వస్తున్నాయి. విజయనగరంలో బొత్స కుటుంబానికి చెందిన అనూష, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి వంటి పేర్లు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో మాజీ మంత్రులు, 2024లో ఓడిన మాజీ ఎమ్మెల్యేల పేర్లపై కూడా చర్చలు జరుగుతున్నాయి. అయితే వీటిలో ఏ పేరూ అధికారికంగా ఖరారైన జాబితాగా ఇప్పటివరకు చెప్పలేం. ప్రస్తుతానికి ఇవి రాజకీయ చర్చల్లో ఉన్న పేర్లు మాత్రమే. ఇదే విషయాన్ని పార్టీ అధికారికంగా కూడా స్పష్టం చేయాల్సి ఉంది. ఎందుకంటే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సమీకరణాలు, సామాజిక వర్గాల లెక్కలు, వ్యక్తిగత అంగీకారం, పార్టీ సంస్థాగత బలం అన్నీ కలిసిన తర్వాతే తుది అభ్యర్థి రూపుదిద్దుకుంటాడు.

• పాత పాఠం.. కొత్త పోటీ.. స్థానిక లెక్క..


ఇక్కడే 2019-2024 మధ్య తేడా గుర్తించాలి. 2019లో జగన్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ముందు ప్రజలలో ప్రత్యామ్నాయ నాయకత్వంగా కనిపించారు. 2024లో మాత్రం ఐదేళ్ల పాలన తర్వాత ప్రజల తీర్పును ఎదుర్కొన్నారు. ఈ రెండు పరిస్థితులు ఒకటి కావు. 2019లో 'కొత్త ముఖం' అంటే మార్పుకు ప్రతీకగా కనిపించవచ్చు. 2026లో అదే కొత్త ముఖం కంటే 'స్థానికంగా ఎవరు నిలబడ్డారు?' అనే ప్రశ్న ముఖ్యమవుతుంది. అలాగే 2019లో ఓటమి నుంచి వచ్చిన నాయకుడికి ఉన్న రాజకీయ ముద్ర ఒకటి. 2024లో ఓడిపోయిన నాయకుడికి ఉన్న రాజకీయ ముద్ర మరోటి. అందుకే గత ఫార్ములాను అచ్చుగుద్దినట్టు పునరావృతం చేయడం కంటే, ప్రతి స్థానిక సంస్థకు వేర్వేరు లెక్క వేయాల్సి ఉంటుంది. వైసీపీకి ఇప్పుడు అత్యంత అవసరమైనది ఒకటే...స్థానిక నాయకత్వాన్ని అవమానించకుండా పెద్ద నాయకత్వాన్ని ఉపయోగించుకోవడం. మాజీ మంత్రి పోటీ చేస్తే స్థానిక కార్యకర్త అతని కింద పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. మాజీ ఎమ్మెల్యేకు మేయర్ టికెట్ ఇస్తే అతని వెంట పది సంవత్సరాలు పనిచేసిన స్థానిక నాయకుడికి కూడా రాజకీయ భవిష్యత్తు కనిపించాలి. కుటుంబ సభ్యుడిని నిలబెట్టినా పార్టీకి చెందిన పాత కార్యకర్తకు 'నీ పని అయిపోయింది' అన్న భావన రాకూడదు. ఎందుకంటే స్థానిక ఎన్నికల్లో ఓటు యంత్రంతో పడదు... సంబంధంతో పడుతుంది. ఇంటి తలుపు తట్టిన వ్యక్తిని చూసి పడుతుంది. సమస్య చెప్పినప్పుడు స్పందించిన వ్యక్తిని గుర్తు చేసుకుని పడుతుంది. కష్టకాలంలో అండగా నిలిచిన వ్యక్తి పేరును గుర్తుచేసుకుని పడుతుంది. అందుకే స్థానిక ఎన్నికలను కేవలం డబ్బు, పేరు, రాజకీయ వారసత్వం లెక్కల్లో చూడటం ప్రమాదకరం.

• పోటీ వేరు.. పునర్నిర్మాణం వేరు.. పునాది వేరు

ఇంకో వాస్తవం కూడా వైసీపీ నాయకత్వం గుర్తించాల్సిందే. ఎన్నికల్లో ఒక్క సీటు కూడా ఏకగ్రీవం కాకూడదన్న ఆలోచన, ప్రతి స్థాయిలో పోటీ చేయాలన్న పట్టుదల పార్టీ యంత్రాంగానికి ఉత్సాహాన్ని ఇవ్వవచ్చు. కానీ పోటీ చేయడం కోసం పోటీ చేయడం వేరు... పోటీని రాజకీయ పునర్నిర్మాణానికి ఉపయోగించడం వేరు. ఒక గ్రామంలో బలమైన కార్యకర్త ఉన్నప్పుడు అతన్ని పక్కనపెట్టి ఓడిపోయిన పెద్ద నాయకుడి అనుచరుడికి అవకాశం ఇస్తే పార్టీకి ఒక అభ్యర్థి దొరుకుతాడు. కానీ ఒక కార్యకర్తను కోల్పోతుంది. వంద గ్రామాల్లో అదే జరిగితే వంద మంది కార్యకర్తలను కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఎన్నికల లెక్కలో అది ఒక్కో సీటు కాదు...ఒక్కో కుటుంబం, ఒక్కో బూత్, ఒక్కో సామాజిక సంబంధం కోల్పోవడం. అందుకే తాడేపల్లిలో ఇప్పుడు తయారవుతున్న జాబితాలు కేవలం అభ్యర్థుల జాబితాలు కావు. అవి వైసీపీ భవిష్యత్ నాయకత్వ పటాలు. ఎవరికీ టికెట్ ఇచ్చారు అన్నదానికంటే ఎవరి మీద నమ్మకం ఉంచారు అన్నదే ముఖ్యమైన విషయం. ఓడిపోయిన నాయకుడిని మళ్లీ నిలబెట్టడం తప్పు అని చెప్పలేం. స్థానిక కార్యకర్తకు అవకాశం ఇవ్వడమే సరైనదని కూడా ముందే తీర్పు ఇవ్వలేం. ప్రతి నియోజకవర్గం, ప్రతి పట్టణం, ప్రతి గ్రామం లెక్క వేరు. కానీ ఒక విషయం మాత్రం రాజకీయ చరిత్ర చెబుతోంది...పార్టీకి నాయకులు అవసరం, కానీ నాయకులను మోసే కార్యకర్తలు లేకపోతే పార్టీకి భవనం మాత్రమే మిగులుతుంది.

• పాతవారా.. కొత్తవారా.. పునర్నిర్మాణమా.. పునరావృతమా?

జగన్ ఇప్పుడు ఎంచుకోవాల్సింది అందుకే 'పాతవారా? కొత్తవారా?' అనే సూటి ప్రశ్నకు సమాధానం కాదు. పార్టీని గెలిపించగలిగిన స్థానిక సామర్థ్యం ఎవరికి ఉంది? ప్రజల్లో నిలబడగలిగేది ఎవరు? కష్టకాలంలో పార్టీతో ఉన్నది ఎవరు? 2029 వరకూ నేలమీద పనిచేయగలిగేది ఎవరు?



దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న పై దుబాయ్ విమానంలో జరిగిన ఘటన ప్రపంచాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. వందల అడుగుల ఎత్తులో ఎగురుతున్న విమానంలోనే ఇద్దరు పైలట్ల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. పరిస్థితి క్షణాల్లో అదుపు తప్పింది. భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో-పైలట్ దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన స్మిత్ నేలపై పడిపోయినా.. తన ప్రాణాల గురించి ఆలోచించలేదు. తన వెనుక ఉన్న ప్రయాణికులే ఆయనకు కనిపించారు. విమానం ప్రమాదకరంగా కిందికి దూసుకెళ్తోందని గుర్తించిన క్షణంలోనే.. "నేను ఏదో ఒకటి చేయాలి.. లేదంటే వందల మంది ప్రాణాలు పోతాయి" అని నిర్ణయించుకున్నాడు. అదే నిర్ణయం ఆ విమానంలోని ప్రయాణికుల ప్రాణాలను కాపాడే కీలక మలుపుగా మారింది.



ప్యాసింజర్స్ పాలిట ప్రాణదాత ఆ పైలట్..

యావత్ దేశం చేస్తోంది సెల్యూట్..

ప్రాణాలను పణంగా పెట్టిన ధీరుడు.. ఉన్నత పౌర సత్కారానికి అర్హుడు

పైలట్ కాదు.. ఆ క్షణంలో రక్షకుడు

స్మిత్ మచ్చర్ కథ కేవలం ఒక విమాన ప్రమాదాన్ని నివారించిన పైలట్ కథ కాదు. ఒక వ్యక్తి తనకు ఎదురైన ప్రాణాంతక పరిస్థితిని ఎలా ఎదుర్కొన్నాడో చెప్పే కథ. సాధారణంగా పైలట్ బాధ్యత విమానాన్ని సురక్షితంగా నడపడం. కానీ ఆ రోజు స్మిత్‌కు ఎదురైన పరిస్థితి సాధారణ విమాన అత్యవసర పరిస్థితి కాదు. ఆయనపై సహ పైలట్ దాడి చేశాడు. గాయపడ్డాడు. విమానం నియంత్రణ కోల్పోయి వేగంగా కిందికి దిగుతోంది. అయినా ఆయన తన బాధను పక్కన పెట్టాడు. కాక్‌పిట్ తలుపు తెరవడానికి చివరి శక్తిని ఉపయోగించాడు. ఆ తలుపు తెరుచుకోవడంతో క్యాబిన్‌లో ఉన్న సిబ్బంది, ప్రయాణికులకు పరిస్థితి అర్థమైంది. దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకునే అవకాశం ఏర్పడింది. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్ విమానాశ్రయానికి మళ్లించారు. ఒక తలుపు తెరవడం సాధారణ చర్యలా కనిపించవచ్చు. కానీ ఆ రోజు అదే తలుపు తెరవడం వందల ప్రాణాలకు జీవన ద్వారం అయింది.

విమానం ఒక్కసారిగా కిందికి

ఈ ఘటన ఎంత ప్రమాదకరంగా ఉందో విమాన గమనాన్ని చూస్తే అర్థమవుతుంది. ఫ్లైట్ FZ1073 దుబాయ్ నుంచి బయలుదేరి ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్ విమానాశ్రయం వైపు ప్రయాణిస్తోంది. సుమారు రెండున్నర గంటల తర్వాత విమానం సౌదీ అరేబియా గగనతలంలో ఉండగా ఒక్కసారిగా భారీగా కిందికి దిగింది. విమానం సుమారు 34 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. నిమిషానికి దాదాపు 23 వేల అడుగుల వేగంతో దిగినట్లు విమాన ట్రాకింగ్ సమాచారం వెల్లడించింది. రెండు నిమిషాల్లోనే దాదాపు 17 వేల అడుగుల మేర ఎత్తు కోల్పోయింది. అంటే పరిస్థితి ఎంత వేగంగా విషమించిందో అర్థం చేసుకోవచ్చు. కొద్ది సేపటికే అత్యవసర సంకేతం ఇచ్చింది. అనంతరం హైజాకింగ్‌కు సంబంధించిన సంకేతం కూడా కనిపించింది. విమానం కొంతసేపు జోర్డాన్ గగనతలంలోకి వెళ్లి తిరిగి సౌదీ వైపు మళ్లింది. చివరకు తబూక్‌లో అత్యవసరంగా దిగింది. అది కేవలం అత్యవసర ల్యాండింగ్ కాదు.. భారీ విషాదాన్ని తప్పించుకున్న క్షణం.

గాయాలతోనూ చివరి ప్రయత్నం

దాడి సమయంలో స్మిత్ తీవ్రంగా గాయపడ్డాడు. తల, చేతులకు గాయాలయ్యాయి. రక్తస్రావం జరిగింది. శరీరం సహకరించని స్థితి ఏర్పడింది. అయినా ఆయనకు ఒక్క విషయం స్పష్టంగా తెలుసు— విమానం కిందికి వెళ్తోంది. తాను ఏమీ చేయకపోతే తనతో పాటు విమానంలోని ప్రయాణికులందరి ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. "నేను నేలపై గాయాలతో పడి ఉన్నా.. చివరి ప్రయత్నంగా లోపల నుంచి తలుపు తెరవాలి అనుకున్నాను" అని ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన వీడియో కాల్‌లో వివరించాడు. ఈ మాటల్లోనే ఆయన ఆ సమయంలో ఎదుర్కొన్న పరిస్థితి తీవ్రత కనిపిస్తుంది. ఆయనకు భయం ఉండకపోవడం కాదు. గాయాల నొప్పి లేకపోవడం కాదు. కానీ వాటన్నింటికంటే ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలన్న బాధ్యత ముందుకు వచ్చింది. అదే ధైర్యం ఆయనను మళ్లీ కదిలించింది.





"నేను పోరాడకపోతే.."

ప్రధాని మోదీతో మాట్లాడినప్పుడు స్మిత్ తన మనసులో జరిగిన సంఘర్షణను వివరించాడు. "నేను నా ప్రాణాల కోసం పోరాడుతున్నాను. ఆ సమయంలో నేను ధైర్యం చూపకపోతే 170 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతారని నాకు అర్థమైంది" అని చెప్పాడు. ఆ సమయంలో తాను హనుమాన్ చాలీసా చదువుతున్నానని, భగవాన్ హనుమంతుడు తనకు ధైర్యం ఇచ్చాడని కూడా ఆయన వెల్లడించాడు. ఈ మాటలు స్మిత్ వ్యక్తిగత విశ్వాసాన్ని మాత్రమే తెలియజేస్తాయి. అత్యంత క్లిష్ట సమయంలో మనిషికి మానసిక బలం ఎంత అవసరమో కూడా చూపిస్తాయి. ఒక వైపు ప్రాణాంతక దాడి.. మరోవైపు నియంత్రణ కోల్పోతున్న విమానం.. ఇంకోవైపు వందల మంది ప్రయాణికుల భవిష్యత్తు. ఇలాంటి సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడానికి కావాల్సిన మానసిక స్థైర్యమే స్మిత్‌ను ప్రత్యేకంగా నిలబెట్టింది.

17 ఏళ్ల అనుభవం ఇచ్చిన స్థైర్యం

స్మిత్ మచ్చర్ ఒక్కరోజులో పైలట్ కాలేదు. ఆయన వెనుక దాదాపు 17 ఏళ్ల విమానయాన అనుభవం ఉంది. ముంబైలో పెరిగిన ఆయన 2008లో న్యూజిలాండ్‌లోని డునెడిన్‌లో ఉన్న మెయిన్‌ల్యాండ్ ఎయిర్‌లో విమానయాన శిక్షణ ప్రారంభించాడు. అనంతరం భారత విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌లో చేరాడు. అక్కడ సుమారు 11 సంవత్సరాలు పనిచేశాడు. తర్వాత 2022లో ఫ్లైదుబాయ్‌లో చేరాడు. ఆయనకు మొత్తం దాదాపు 9,750 గంటల విమాన ప్రయాణ అనుభవం ఉందని అందుబాటులో ఉన్న వివరాలు చెబుతున్నాయి. ఇందులో 6,400 గంటలకు పైగా విమాన కమాండర్‌గా అనుభవం ఉంది. అంటే వేల గంటల పాటు విమానాన్ని నడిపిన అనుభవజ్ఞుడు. విమానంలో చిన్న సమస్య వచ్చినా దాని స్వభావాన్ని అర్థం చేసుకునే స్థాయి అనుభవం ఆయనకు ఉంది. అదే అనుభవం ఆ అత్యంత క్లిష్ట సమయంలో విమానం ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది.

సంక్షోభంలో ప్రశాంతంగా ఉండే మనిషి

స్మిత్ గతంలో చదువుకున్న విమానయాన సంస్థ అధిపతి ఫిలిప్ కీన్ ఆయనను గుర్తుచేసుకుంటూ.. సంక్షోభ సమయంలో ప్రశాంతంగా ఉండే వ్యక్తిగా వివరించారు. బలవంతపు ల్యాండింగ్ వంటి అత్యవసర పరిస్థితులకు శిక్షణ పొందినా.. ఇలాంటి అరుదైన పరిస్థితిని ఎవరూ సాధారణంగా ఎదుర్కోరని ఆయన చెప్పారు. స్పైస్‌జెట్‌లో స్మిత్‌తో కలిసి పనిచేసిన కెప్టెన్ ధారవ్ గోసాలియా కూడా ఆయనను ఉల్లాసంగా ఉండే, క్రమశిక్షణ కలిగిన పైలట్‌గా గుర్తుచేశారు. స్మిత్‌కు "స్మిత్ మ్యాక్" అనే ముద్దుపేరు కూడా ఉంది. మాజీ భారత వాయుసేన అధికారులు వాణిజ్య విమానయాన రంగంలో ఇచ్చిన శిక్షణ కూడా తన ప్రయాణంలో కీలకమైందని ఆయన స్నేహితులు చెప్పారు. అంటే ఆ రోజు ఆయన చూపించిన ధైర్యం వెనుక కేవలం సహజమైన ధైర్యమే కాదు.. సంవత్సరాల శిక్షణ, అనుభవం, క్రమశిక్షణ, బాధ్యతాభావం ఉన్నాయి.

చిన్న కల.. పెద్ద ప్రయాణం

స్మిత్‌కు చిన్నప్పటి నుంచే పైలట్ కావాలనే కల లేదు. దాదాపు 19 ఏళ్ల వయసులో కుటుంబ వ్యాపారంలో చేరాలనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ కోర్సులో చేరాలని భావించాడు. అదే సమయంలో ఒక విమానయాన సెమినార్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి విమానాలపై ఆసక్తి పెరిగింది. ఆ ఆసక్తి చివరకు వృత్తిగా మారింది. తరువాత ఆయన పైలట్ యూనిఫాం ధరించినప్పుడు పని విషయంలో పూర్తి క్రమశిక్షణతో ఉండేవాడు. అయితే వ్యక్తిగత జీవితానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని తరువాతి కాలంలో గ్రహించాడు. "వ్యక్తిగత జీవితానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వండి.. అది ఎక్కువకాలం సురక్షితంగా ఎగరడానికి సహాయపడుతుంది" అనే సందేశాన్ని యువతకు ఇచ్చాడు. విమానయానంపై మాట్లాడిన పాత పోడ్‌కాస్ట్‌లో ఆయన చెప్పిన మాటలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. ఒకప్పుడు తన విమానంలో పెద్ద అత్యవసర ల్యాండింగ్ అవసరం రాలేదని ఆయన చెప్పాడు. కానీ వైద్య అత్యవసర పరిస్థితులు, చిన్న విమాన సమస్యలను ఎదుర్కొన్నట్లు వివరించాడు.

ప్రయాణికుడి ప్రాణమే మొదటి బాధ్యత

స్మిత్ గత అనుభవాల్లో ఒక ప్రయాణికురాలు విమానంలోనే ప్రసవ వేదనకు గురైన ఘటన కూడా ఉంది. అప్పుడు సిబ్బంది కలిసి తల్లికి, శిశువుకు సురక్షితంగా సహాయం చేశారు. ఇలాంటి అనుభవాలు పైలట్ ఉద్యోగం కేవలం విమానాన్ని నడపడం కాదని ఆయనకు మరింత స్పష్టం చేశాయి. విమానంలో ఉన్న ప్రతి వ్యక్తి సురక్షితంగా బయటకు రావడమే అసలు లక్ష్యం అని ఆయన ఎప్పుడూ భావించేవాడు. అందుకే విమాన ఆలస్యం తనకు పెద్ద విషయం కాదని.. ప్రయాణికులు సురక్షితంగా విమానం నుంచి బయటకు నడిచి వెళ్తే అదే ముఖ్యమని ఆయన గతంలో చెప్పాడు. ఈ ఆలోచనే బుధవారం జరిగిన ఘటనలో కూడా ఆయన అమలు చేశాడు. తన ప్రాణం కంటే ముందు ప్రయాణికుల ప్రాణాలను ఉంచాడు. ఒక పైలట్‌కు ఉండాల్సిన వృత్తి ధర్మాన్ని అత్యంత ప్రమాదకర పరిస్థితిలో కూడా విడిచిపెట్టలేదు.

తండ్రి మాటల్లో అసలు స్మిత్

స్మిత్ తండ్రి భూపేంద్ర మచ్చర్ చెప్పిన మాటలు ఈ కథలో మరో ముఖ్యమైన కోణాన్ని చూపిస్తున్నాయి. కుమారుడి ధైర్యం గురించి ప్రపంచం మాట్లాడుతున్న సమయంలో తల్లిదండ్రులకు మాత్రం మొదట గుర్తొచ్చింది భయం. ఘటన తెలిసిన వెంటనే వారు దేవుడి ముందు ప్రార్థించారు. కుమారుడు సురక్షితంగా ఉండాలని కోరుకున్నారు. తండ్రి చెప్పిన ప్రకారం స్మిత్‌కు తల, రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. తలకు శస్త్రచికిత్స జరిగింది. కుట్లు పడ్డాయి. పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుంది. "అందరూ గర్వపడుతున్నారు.. కానీ మా కోసం ముందుగా మా కొడుకు ఆరోగ్యం ముఖ్యం" అని ఆయన చెప్పారు. అదే ఒక తండ్రి సహజమైన ఆలోచన. అయితే తన కుమారుడిలో ఉన్న విలువలు, తల్లిదండ్రుల పట్ల గౌరవం, వృత్తి పట్ల అంకితభావం యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన కోరుకున్నారు.

ప్రపంచం ఎందుకు గుర్తించింది?

స్మిత్ మచ్చర్‌ను ప్రపంచం గుర్తించడం వెనుక ప్రధాన కారణం ఆయన చేసిన పని మాత్రమే కాదు.. ఆ పని చేసిన సమయం, పరిస్థితి, ఆయన గాయాల తీవ్రత. ఒక పైలట్ తనపై దాడి జరిగిన తరువాత కూడా విమానం, ప్రయాణికుల గురించి ఆలోచించడం అసాధారణం. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆయనను నిజమైన హీరోగా అభివర్ణించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆయన ధైర్యం, నిర్ణయ సామర్థ్యాన్ని ప్రశంసించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా ఆయన చూపిన అసాధారణ ధైర్యాన్ని కొనియాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఘటనపై స్పందిస్తూ ఆయన కాక్‌పిట్ తలుపు తెరవగలిగిన తీరు గురించి ప్రశంసించారు. భారత ప్రభుత్వ అధికారులు ఆయనను కలసి ధైర్యం చెప్పారు. స్పైస్‌జెట్ సంస్థ కూడా ఆయనను హీరోగా పేర్కొంది. ఒక భారతీయ పైలట్ చేసిన త్యాగస్ఫూర్తి అంతర్జాతీయ స్థాయిలో చర్చకు రావడానికి ఇదే కారణం.

స్మిత్ మచ్చర్‌ను ఎందుకు గుర్తుంచుకోవాలి?

స్మిత్ మచ్చర్‌ను మనం కేవలం ఒక విమాన ప్రమాదాన్ని అడ్డుకున్న పైలట్‌గా గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు. బాధ్యత అంటే ఏమిటి.. సంక్షోభ సమయంలో నిర్ణయం అంటే ఏమిటి.. వృత్తి ధర్మం అంటే ఏమిటి.. ఇతరుల ప్రాణాల విలువ ఎంత అన్నది ఆయన చూపించాడు. తనకు గాయం అయినప్పుడు వెనక్కి తగ్గడం సహజం. భయపడటం సహజం. కానీ తన వెనుక ఉన్న ప్రయాణికుల కోసం మళ్లీ లేచి నిలబడటం అసాధారణం. ఆయన చేసిన పని యువతకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. మనం ఏ వృత్తిలో ఉన్నా.. మన చేతుల్లో ఉన్న బాధ్యతను నిజాయితీగా నిర్వర్తిస్తే ఒకరి జీవితం మాత్రమే కాదు.. ఎన్నో జీవితాలు ప్రభావితం కావచ్చు. స్మిత్ తన ధైర్యంతో ఒక విమానాన్ని మాత్రమే కాపాడలేదు. బాధ్యత ముందు వ్యక్తిగత భయం చిన్నదైపోతుందని ప్రపంచానికి గుర్తు చేశాడు. అందుకే ఆయన కథను ఒక ప్రమాద కథగా కాకుండా.. మానవ ధైర్యం, వృత్తి నిబద్ధత, ఇతరుల ప్రాణాల పట్ల గౌరవానికి ఉదాహరణగా గుర్తుంచుకోవాలి.

చివరి వన్డేలో టీమిండియా

కీలక మార్పులు

భారతదేశం వేదికగా జరుగుతున్న భారత్, వెస్టిండీస్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో ఘన విజయాలు సాధించిన టీమిండియా 20 తేడాతో అజేయమైన ఆధిక్యాన్ని దక్కించుకుంది. ఇప్పుడు ఆదివారం జరగనున్న మూడో అలాగే చివరి వన్డేలో వెస్టిండీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని పట్టుదలగా ఉంది. అదే సమయంలో ఇప్పటివరకు తుది జట్టులో ఆడే అవకాశం రాని రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లను మైదానంలోకి దించి వారి ప్రతిభను పరీక్షించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. గౌహతిలో జరిగిన రెండో వన్డేలో భారత్ అద్భుతమైన ప్రదర్శన చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ శుభమన్ గిల్ అజేయంగా 223 పరుగులు చేయగా, రోహిత్ శర్మ 101 పరుగులతో రాణించారు. అయితే ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌కు అనుకూలంగా పిచ్‌లు మారుతుండటంపై విమర్శలు వస్తున్నాయి. గత మ్యాచ్‌లో రెండు జట్లు కలిసి ఏకంగా 800లకు పైగా పరుగులు సాధించడం విశేషం. భారత్ ప్రధాన కోచ్ గౌతం గంభీర్ సైతం బ్యాట్, బాల్ మధ్య సరైన బ్యాలెన్సింగ్ ఉండాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా భారత బౌలర్లు మిగతా ఓవర్లలో వికెట్లు తీయడానికి కాస్త ఇబ్బంది పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సిరీస్ ఇప్పటికే మనవశం కావడంతో మేనేజ్‌మెంట్ తుది జట్టులో కొన్ని ప్రయోగాలు చేయడానికి ఇది సరైన సమయంగా భావిస్తోంది. రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, మొహమ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లకు తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఓపెనర్లు రోహిత్, గిల్‌తో పాటు కోహ్లీ కూడా అద్భుతంగా రాణించారు. స్క్వాడ్‌లో మొత్తం 15 మంది ఆటగాళ్లు ఉండగా, కేవలం బెంచ్‌కే పరిమితమైన వారికి ఆడే సమయం లభిస్తుంది. అయితే గత మ్యాచ్‌లో ఎడమ కాలి హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో అన్షుల్ కంబోజ్ జట్టులోకి వచ్చాడు. భారత పేస్ బౌలింగ్ విభాగంలో యువ ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. తొలి రెండు మ్యాచ్‌లలో ఆడే అవకాశం రాని స్థానిక పేసర్ మొహమ్మద్ సిరాజ్ తుది జట్టులోకి తిరిగి వచ్చే ఛాన్స్ ఉంది. శ్రీలంక పర్యటన తర్వాత సిరాజ్ తన అత్యుత్తమ లయను అందుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. గురునూర్ బ్రార్, ఆకిబ్ నబీ వంటి యువ సంచలనాలు కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ ఏడాది చివరిలో న్యూజిలాండ్‌తో జరగబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు, ఈ ఆఖరి వన్డే యువ బౌలర్లకు తమ సత్తా నిరూపించుకోవడానికి గొప్ప వేదిక కానుంది. ములాంపూర్ వేదికగా పురుషుల వన్డే మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి. ఇక్కడి పిచ్ బౌలర్లకు కొంత వరకు సహకరిస్తుందని భావిస్తున్నారు. సిరీస్ కోల్పోయినప్పటికీ, వెస్టిండీస్ జట్టు తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది.





భారత్ ఏ అసాధారణ పోరాటం..

- ఆస్ట్రేలియా ఏ జట్టుతో రెండో టెస్టు ఉత్కంఠభరిత డ్రా
- 1-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ ఏ జట్టు

భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. చివరి రోజు అసాధారణ పోరాటపటిమ కనబరిచిన యశ్ రాథోడ్, షామ్స్ ములానీ గట్టి పట్టుదలతో క్రీజులో నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఏ 10 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో 162 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో సిరీస్ విజేతగా నిలిచింది. శుక్రవారం, నాలుగో రోజు ఆటలో 365 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఏ, ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. విజయానికి 55 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, ఆసీస్ బౌలర్ల నిరంతర దాడిని తట్టుకుని ఓటమిని తప్పించుకోవడంలో సఫలమైంది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన తుషార్ దేశ్‌పాండే (52), యశ్ రాథోడ్ (80) హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర పోషించగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన షామ్స్ ములానీ (131 బంతుల్లో 26) అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కాపాడాడు. నాలుగో రోజు ఆట ప్రారంభంలోనే భారత్ ఏ పై ఒత్తిడి పెరిగింది. అయితే నైట్‌వాచ్‌మన్ తుషార్ దేశ్‌పాండే సుమారు 180 నిమిషాల పాటు క్రీజులో నిలబడి ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (26)తో కలిసి 60 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే లంచ్ తర్వాత ఆసీస్ బౌలర్ లియామ్ స్కాట్ (5/52) తన పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వైవిధ్యభరిత బౌన్స్‌తో ఇబ్బంది పెడుతూ పడిక్కల్, దేశ్‌పాండేలతో పాటు తొలి మ్యాచ్ సెంచరీ హీరో కుమార్ కుశాగ్రను కూడా పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ ఏ 199 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో యశ్ రాథోడ్, షామ్స్ ములానీ జతకలిశారు. ఓటమి అంచున ఉన్న జట్టును గట్టెక్కించడానికి వీరోచితంగా పోరాడారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 131 బంతులు ఎదుర్కొని 85 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్న దశలో లియామ్ స్కాట్ మళ్లీ చెలరేగాడు. మొదట రాథోడ్‌ను, ఆ తర్వాత ములానీని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి ఉత్కంఠను తారాస్థాయికి చేర్చాడు. చివరి మూడు ఓవర్లు మిగిలి ఉండగా భారత్ చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. అన్షుల్ కంబోజ్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ప్రఫుల్ హింగేతో కలిసి నచికేత్ భూతే (20 నాటౌట్) చివరి ఓవర్లను జాగ్రత్తగా ఆడి మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు.


కొన్ని విషయాలు మనతోనే ఉండాలి

రోహిత్ శర్మ కీలక వ్యాఖ్యలు



వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అద్భుత శతకంతో మెరిసిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ప్రత్యేక సంబరాలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. సెంచరీ పూర్తయ్యాక సాధారణంగా బ్యాట్ పైకెత్తే క్రికెటర్లకు భిన్నంగా.. హిట్‌మ్యాన్ హైనీ జాగింగ్ తరహాలో వినూత్నంగా అడుగులు వేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ డిఫరెంట్ సెలబ్రేషన్ వెనుక ఉన్న రహస్యమేంటని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, రోహిత్ స్పందిస్తూ.. "కొన్ని విషయాలు మనతోనే ఉండాలి, ప్రతీదీ బయటకు చెప్పాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించడం విశేషం. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ విధించిన 406 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో రోహిత్ శర్మ (75 బంతుల్లో 101) కీలక పాత్ర పోషించాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (223 నాటౌట్)తో కలిసి తొలి వికెట్‌కు ఏకంగా 255 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ క్రమంలోనే రోహిత్ తన వన్డే కెరీర్‌లో 35వ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత తన వైరల్ సెలబ్రేషన్ గురించి రోహిత్ మాట్లాడుతూ, అది తన వ్యక్తిగత విషయమని స్పష్టం చేశాడు. మైదానంలోనే ఉన్న రవీంద్ర జడేజా కూడా ఈ సంబరం వెనుక ఉన్న కారణాన్ని అడగ్గా, డ్రెస్సింగ్ రూమ్‌కి వచ్చాక చెబుతానని దాటవేసినట్లు రోహిత్ తెలిపాడు.

రిటైర్మెంట్ ప్రకటించిన యుజ్వేంద్ర చాహల్!



టీమిండియా వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ రెడ్ బాల్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్‌తో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. కౌంటీ క్రికెట్‌లో భాగంగా లార్డ్స్‌లో తన చివరి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన అనంతరం చాహల్ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. దాంతో భారత్ తరఫున టెస్ట్ క్రికెట్ ఆడాలనే చాహల్ కలలకు అధికారికంగా తెరపడినట్లయింది. వైట్‌బాల్ క్రికెట్‌లో మాత్రం రీఎంట్రీ కోసం తన ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశాడు. 'భారత్ తరఫున టెస్ట్ క్యాప్ అందుకోవడం నా కెరీర్ లో అతిపెద్ద కల. కానీ ఇకపై అది నెరవేరకపోవచ్చు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటివరకు సాగిన నా ప్రయాణం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. రెడ్ బాల్ క్రికెట్ అనేది ఓ ఫార్మాట్ మాత్రమే కాదు తన 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 49 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. 32.27 యావరేజ్‌తో 148 వికెట్లు నేలకూల్చాడు. లార్డ్స్ లో మిడిల్ సెక్స్‌తో జరిగిన మ్యాచ్ చాహల్ కెరీర్‌లో చివరి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌గా నిలిచింది. టీమిండియా టెస్ట్ జట్టులో రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలు సుదీర్ఘ కాలం సత్తా చాటడంతో చాహల్‌కు అవకాశం లేకుండా పోయింది.



తెల్ల కాగితం.. ప్రేమకు పరీక్ష!

చిన్న వయసు ప్రేమ.. పెద్ద మూల్యం! 16 ఏళ్ల రాము, ఆశల అమాయక ప్రేమను తెరపైకి తీసుకొచ్చిన 'తెల్ల కాగితం'.. ప్రేమకథగా మొదలై, ఊహించని సంక్షోభంతో ప్రేక్షకుల్ని ఆలోచనలో పడేసే హెచ్చరిక కథగా మారుతుంది. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ 163 నిమిషాల చిత్రం 2000ల చివరి నాటి ఆంధ్రప్రదేశ్ పల్లె వాతావరణాన్ని అద్భుతంగా చూపిస్తుంది. ల్యాండ్‌లైన్ ఫోన్లు, పరిమిత ఇంటర్నెట్, చిన్న ఆశలు, పిల్లల చదువుకోసం తల్లిదండ్రుల త్యాగాలు.. ఈ నేపథ్యానికి రాము (హర్ష్ రోషన్), ఆశ (నక్షత్ర) ప్రేమ మరింత సహజత్వాన్ని తీసుకొస్తుంది. స్కూల్లో లంచ్ బాక్సులు మారడం నుంచి మొదలైన పరిచయం.. స్నేహం, ప్రేమగా మారుతుంది. కానీ ఓ అనుకోని సమస్య ఇద్దరినీ పెద్ద నిర్ణయాల వైపు నెడుతుంది. పెద్దలను అడగాలా? సమస్యను తామే పరిష్కరించుకోవాలా? అనే సందిగ్ధంలో తీసుకున్న నిర్ణయాలు వారి జీవితాలను మలుపు తిప్పుతాయి. తొలి గంట హాయిగా, పల్లెటూరి ప్రేమను అందంగా చూపిస్తే.. ద్వితీయార్ధం ఉత్కంఠ, బాధ, భావోద్వేగాలతో వేగం పెంచుతుంది. అయితే కథ ఎక్కువగా టీనేజర్ల తప్పులు, సమాజం భయాలపైనే దృష్టి పెట్టి.. వారిని చుట్టుముట్టిన కఠినమైన సామాజిక వాతావరణాన్ని పూర్తిగా ప్రశ్నించలేకపోయింది. మహిళా పాత్రలకు పరిమిత స్వేచ్ఛ, కుటుంబాల్లో అధికారం, లైంగిక అవగాహన లోపం వంటి అంశాలు ఆలోచింపజేస్తాయి. హర్ష్ రోషన్, నక్షత్ర ఆకట్టుకోగా.. విజయ్ బుల్గానిన్ సంగీతం, కె.వి. గుహన్ కెమెరా సినిమాకు ప్రత్యేక బలం. ప్రేమలో అమాయకత్వం ఉంది.. కథలో హెచ్చరిక ఉంది.. కానీ 'తెల్ల కాగితం'పై ఇంకా కొంచెం లోతైన కథనం రాసి ఉంటే ఈ ప్రయాణం మరింత బలంగా నిలిచేది!



కజ్రా రే 2.0.. మళ్లీ మోత మోగేనా?



21 ఏళ్ల తర్వాత అదే మ్యాజిక్ కోసం బాలీవుడ్ అభిమానుల ఎదురుచూపులు! 2005లో వచ్చిన బంటీ ఔర్ బబ్లీలోని 'కజ్రా రే' పాట అప్పట్లో థియేటర్లను ఊపేసింది. అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్, అమితాబ్ బచ్చన్ కలిసి తెరపై చేసిన సందడి ఇప్పటికీ అభిమానుల జ్ఞాపకాల్లో చెరిగిపోలేదు. తాజాగా బీబీసీతో మాట్లాడిన అభిషేక్.. 'కజ్రా రే 2.0' చేయడానికి తాను పూర్తిగా సిద్ధమని చెప్పి ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చారు. "నాకు చాలా ఇష్టం.. నేను రెడీ. కానీ ఐశ్వర్య, మా నాన్నను ఒప్పించాలి" అంటూ నవ్వుతూ చెప్పిన ఆయన.. అసలు పాట షూటింగ్ జ్ఞాపకాలను కూడా పంచుకున్నారు. తనకు ఇంతకంటే సరదాగా మరో పాట షూట్ చేశానో లేదో గుర్తులేదని, అది మొత్తం ఒక పెద్ద పార్టీలా సాగిందని తెలిపారు. షూటింగ్ సమయంలో తన పుట్టినరోజు రావడంతో యూనిట్ వేడుకలు నిర్వహించిందని చెప్పారు. దర్శకుడు షాద్ అలీ గంటలకొద్దీ పాట ప్లే చేయగా.. అందరూ సెట్లో డ్యాన్స్ చేస్తూ ఎంజాయ్ చేశారని, ఆ సరదా క్షణాల్లో కొన్నింటినే పాటలో ఉపయోగించారని వెల్లడించారు. శంకర్–ఎహ్‌సాన్–లాయ్ సంగీతం, అలీషా చినాయ్, శంకర్ మహదేవన్, జావేద్ అలీ గానం, వైభవి మర్చంట్ కొరియోగ్రఫీ కలిసిన 'కజ్రా రే' ఇప్పటికీ కల్ట్ స్టేటస్‌లో ఉంది. ఇప్పుడు అభిషేక్ మాటలతో 'కజ్రా రే 2.0'పై కొత్త ఆసక్తి మొదలైంది. ఐశ్వర్య, అమితాబ్ కూడా ఓకే అంటే.. ఆ మాస్ మ్యాజిక్ మళ్లీ తెరపై మోగడం ఖాయమేనా?



ఫహాద్ ఫాజిల్ తొలిసారి సోలో హీరోగా నటించిన తెలుగు చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ప్రేక్షకుల ముందుకొచ్చింది. శశాంక్ యేలేటి రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ 158 నిమిషాల సినిమా.. పిల్లలను, పిల్లల మనసున్న పెద్దలను అలరించాలనే ప్రయత్నం చేసింది. అంబులెన్స్ డ్రైవర్ సూరి (ఫహాద్) ఈజీగా డబ్బు సంపాదించేందుకు ఎంతకైనా తెగించే వ్యక్తి. ఓ చిన్నారిని కిడ్నాప్ చేసి డబ్బు సంపాదించాలనుకోవడంతో మొదలయ్యే కథ.. అక్కడి నుంచి ఊహించని 'ట్రబుల్'లోకి దూసుకెళ్తుంది. సూరి–దివ్య (స్వారా పలేకర్)–న్యూపీ బీగల్ కాంబినేషన్ సినిమాకు అసలు ప్రాణం. ముఖ్యంగా ఇంటర్వెల్‌కు ముందు వచ్చే ఎపిసోడ్ థియేటర్లలో నవ్వులు, సందడి పంచుతుంది. మ్యాజిక్ ల్యాంప్, అదృశ్య వ్యక్తి, మంత్రాల ప్రపంచం వంటి ఆసక్తికరమైన ఆలోచనలు పిల్లలను ఆకట్టుకునేలా ఉన్నాయి. అయితే ఓల్డ్ సిటీ, చార్మినార్ నేపథ్యంలో సాగే కొన్ని సన్నివేశాలు, మూస పాత్రలు, బలహీనమైన కామెడీ కథ వేగాన్ని తగ్గిస్తాయి. మ్యాజిక్ ట్రిక్స్ పదేపదే రావడంతో ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతుంది. హైదరాబాద్‌లోని నిజమైన లొకేషన్లలో చిత్రీకరణ సినిమాకు సహజత్వాన్ని తెచ్చింది. ఫహాద్ సూరి పాత్రలో అద్భుతంగా మెప్పించగా, స్వారా పలేకర్ అమాయకత్వం, భావోద్వేగాలను చక్కగా పలికించింది. సూరి–దివ్య బంధం బలపడే కొద్దీ కథకు భావోద్వేగ బలం పెరుగుతుంది. క్లైమాక్స్‌లో వచ్చే మెలోడ్రామా సూరి పాత్ర మార్పుకు ముగింపు ఇస్తుంది. హృదయం ఉన్న సినిమా.. నవ్వించే క్షణాలున్న సినిమా.. కానీ రచనలో ఇంకొంచెం మ్యాజిక్ ఉంటే థియేటర్లలో పండుగ మరింత పెద్దదయ్యేది!

మ్యాజిక్ ఉంది.. మజా కొంతే!

స్టైల్ ఉంది.. కొత్తదనం ఎక్కడ?

సుందీప్ కిషన్ వన్‌మ్యాన్ షో.. జేసన్ సేఫ్ గేమ్! తమిళంలో తెరకెక్కిన సిగ్మాతో నటుడు విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా అరంగేట్రం చేశారు. సుందీప్ కిషన్, ఫారియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ హీస్ట్‌యాక్షన్ డ్రామా.. ఆసక్తికరమైన ఆలోచనలతో మొదలై, చివరికి తెలిసిన దారుల్లోనే నడుస్తుంది. అప్పుల్లో కూరుకుపోయిన లైబ్రేరియన్ గురు (సుందీప్)కు ఓ రహస్య వాల్ట్ తాళం దొరకడంతో కథ అసలు మలుపు తిరుగుతుంది. తల్లి నడిపిన పాత లైబ్రరీని కాపాడుకుంటూ, ఆడియోబుక్ యూట్యూబ్ ఛానల్ నడుపుతూ, ఏఐ వాయిస్‌తో కొత్త శ్రోతలను ఆకట్టుకోవాలని ప్రయత్నించే గురు పాత్రలో సుందీప్ సహజంగా ఒదిగిపోయారు. మరోవైపు తండ్రి పురాతన వస్తువుల దుకాణం కూడా ఆదాయం లేక ఇబ్బందుల్లో పడటంతో ఆర్జే సామ్ (ఫారియా) కూడా గురుతో చేతులు కలుపుతుంది. వీరి చిన్న గ్యాంగ్ డబ్బు కోసం క్రైమ్ ప్రపంచంలోకి అడుగుపెట్టడంతో డ్రగ్ కార్టెల్, అక్రమ గ్యాంబ్లింగ్ డెన్, మోసాలు, ఎదురుదాడులతో కథ పరుగులు పెడుతుంది. బ్రూస్ లీ, ఎంటర్ ది డ్రాగన్ ప్రస్తావనలు, గ్రేవ్‌యార్డ్ కామెడీ, ప్రీఇంటర్వెల్ యాక్షన్ ఆకట్టుకుంటాయి. తమన్ సంగీతం సినిమాకు స్టైల్ తెచ్చాయి. కానీ తర్వాతి భాగంలో పాత్రలు పెరిగి గందరగోళం ఎక్కువవుతుంది. సుందీప్ కిషన్ తన అండర్‌డాగ్ పాత్రను భుజాలపై మోస్తే.. ఫారియా తనదైన ముద్ర వేసింది. జేసన్‌లో మెరుపులు కనిపించినా.. హీస్ట్ కథకు మరింత కొత్తదనం జోడించి ఉంటే ఈ తొలి అడుగు మరింత బలంగా ఉండేది. స్టైల్ ఉంది.. స్పార్క్ ఉంది.. కానీ 'సిగ్మా'కు కావాల్సిన ఆ కొత్త జోష్ మాత్రం పూర్తిగా పండలేదు!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.